ఈనాడు
అమరావతి
గుంటూరు
బుధవారం అక్టోబరు 9, 2024 9

అమరావతిలో అందరికీ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు


మాట్లాడుతున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్

తుళ్లూరు, న్యూస్‌టుడే : రాజధాని అమరావతిలో ప్రతి ఒక్కరికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఓ కల్యాణ మండపంలో నైపుణ్య గణనపై పలువురు అధికారులతో సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రవీణ్ చంద్ హాజరై మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు నివేదిక సమర్పించాల్సి ఉన్నందున ఇచ్చిన గడువులోపు రాజధాని గ్రామాల్లో నైపుణ్య గణన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రెండు గంటలకు ఎంత శాతం నమోదు చేశారో? తానే స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారన్నారు. తుళ్లూరు మండలంలో 41 వేల మందికి పైగా జనాభా ఉన్నారు. వారందరికి ఉన్న నైపుణ్యాలు ఏంటి? సీఆర్డీఏ ద్వారా వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలో తెలుసుకోవడమే నైపుణ్య గణన ముఖ్య ఉద్దేశమన్నారు. రానున్న కాలంలో అమరావతిలో 50 వేల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా స్థానికులకు ప్రభుత్వం ద్వారా శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. సీఆర్డీఏ సామాజిక విభాగం గ్రూప్ డైరెక్టర్ కృష్ణ మోహన్, తుళ్లూరు తహసీల్దార్ జి.సుజాత, ఎంపీడీవో కానూరి శిల్ప, పలువురు అధికారులు పాల్గొన్నారు.

11 నుంచి మిర్చియార్డుకు సెలవులు

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డుకు ఈనెల 11వ తేదీ నుంచి సెలవులు ఇస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. 11న దుర్గాష్టమి, 12న విజయదశమితో పాటు వారాంతం, 13వ తేదీ ఆదివారం సాధారణ సెలవు కారణంగా వరుసగా మూడు రోజులు పాటు మిర్చి క్రయ విక్రయాలు జరగవన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు శుక్ర, శని, ఆదివారాలు మిర్చియార్డుకు సరకు తీసుకురావద్దన్నారు. 14వ తేదీది నుంచి యథావిధిగా మిర్చి వ్యాపార లావాదేవీలు జరుగుతాయని వివరించారు.

ఉల్లంఘనులకు ఝలక్!

- గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ ఉదంతంలో అంతులేని నిర్లక్ష్యం
- ఐఏఎస్, సీనియర్ అధికారులపైనా చర్యలకు సిఫార్సు

ఈనాడు, అమరావతి



గుంటూరు నగరం పట్టాభిపురం ప్రధాన రహదారి పక్కన వైకాపా నాయకుడు అంబటి మురళీకృష్ణకు చెందిన గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణాలకు పూర్తిస్థాయిలో అనుమతులు లేకపోయినా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోలేదు. ఈ బాధ్యతారాహిత్యంపై ప్రస్తుతం నగరపాలిక ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి ఇందుకు బాధ్యులైన వారందరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన జాబితాలో ఓ ఐఏఎస్ అధికారి, పురపాలకశాఖ అదనపు సంచాలకులు ఉండడం గమనార్హం.

ఐదు అంతస్తులకు అనుమతులు తీసుకుని..

ఆ అపార్ట్‌మెంట్‌కు ఐదంతస్తులు నిర్మించుకోవడానికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా 14 అంతస్తులు నిర్మించుకున్న విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో బాధ్యులైన జీఎంసీ అధికారులపై రాష్ట్ర పురపాలకశాఖ సంచాలకులకు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులపై ఆ విభాగం డైరెక్టర్‌కు లేఖ రాసి బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని ఆ లేఖల్లో పేర్కొన్నారు. ఆ అపార్ట్‌మెంట్‌కు అనుమతులు ఇచ్చిన సమయంలో ఒకరిద్దరు ఐఏఎస్ అధికారులు, గ్రూప్-1 సీనియర్ అధికారులు కమిషనర్లుగా పనిచేశారు. వారి పర్యవేక్షణ లోపం ఉందని గుర్తించి క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు.

ఎమ్మెల్యే ధూళిపాళ్ల ఆరోపణలతో కదిలారు..

అనుమతులు లేకుండా ఆ అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారని, అయినా నగరపాలక అధికారులు పట్టించుకోలేదని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పత్రికా ముఖంగానే ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఉన్నత స్థాయి నుంచి ఇందుకు బాధ్యులను గుర్తించాలని ఆదేశాలు రావడంతో నగరపాలక ఉన్నతాధికారులు స్పందించారు. అప్పట్లో ఎవరెవరు పనిచేశారు? వారిలో ఎవరైనా ఉద్యోగ విరమణ చేశారా? ప్రస్తుతం ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో వారి వివరాలతో సహా సేకరించి ప్రభుత్వానికి తగు చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసినట్లు నగరపాలక వర్గాలు తెలిపాయి. తామిచ్చిన ఎన్వోసీకి మించి నిర్మాణం చేస్తున్నారని, దానిని రద్దు చేసుకున్నామని ఏడాది కిందటే తెలియజేస్తూ రైల్వే శాఖ పంపిన లేఖకు నగరపాలిక అధికారులు స్పందించలేదు. ఇది ముమ్మాటికీ తప్పిదం కిందకే వస్తుందని నిర్ధారించుకున్నాకే బాధ్యులపై చర్యలు కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశామని నగరపాలిక వర్గాలు పేర్కొన్నాయి.


ఆ అధికారులు వీరే

హోదా	పేరు
కమిషనర్	కె.కన్నబాబు(ఐఏఎస్)
కమిషనర్	అనురాధ (అదనపు డైరెక్టర్ పురపాలకశాఖ)
టీపీబీఓ	సువర్ణకుమార్
డీసీపీ	విశ్వప్రసాద్
ఏసీపీ	రవీంద్రారెడ్డి
డీసీపీ	బి.సత్యనారాయణ (విశ్రాంతఅధికారి)
ఇన్‌ఛార్జి సీపీ	కె.హిమబిందు
ఏసీపీ	బాబురావు
టీపీఎస్	సీహెచ్ భవానీ
టీపీఎస్	హృదయరాజు
ప్లానింగ్ సెక్రటరీ	కె.అనిల్‌కుమార్
ప్లానింగ్ సెక్రటరీ	చదలవాడ జగన్‌మోహన్
టీపీఎస్	షేక్ రిజ్వానా
ఏసీపీ	పి.మురళి
డీసీపీ	మహపాత్ర
సీపీ	ప్రదీప్‌కుమార్
సూపరింటెండెంట్	పోలేశ్వరరావు
గుమ్మస్తా	జి.నారాయణమూర్తి

సిరుల శ్రీలక్ష్మి.. మహిలో మాలక్ష్మి

జగన్మాత దర్శనానికి పోటెత్తిన భక్తజనం

ఈనాడు, డిజిటల్ - అమరావతి



విజయవాడ దుర్గగుడిలో శరన్నవరాత్రి వేడుకల్లో ఆరో రోజు మంగళవారం మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. మంగళప్రదమైన మహాలక్ష్మీదేవిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వేకువన 4 గంటల నుంచి క్యూలైన్లలో బారులు తీరి అమ్మను దర్శించుకున్నారు. రాత్రి 11 గంటల వరకూ దుర్గమ్మ దర్శనానికి భక్తులను అనుమతించారు. మహాలక్ష్మిని దర్శిస్తే భక్తులకు ఐశ్వర్యప్రాప్తి, విజయం లభిస్తాయనేది నమ్మకం. ఉదయం నుంచి రాత్రి వరకు లక్ష మందికి పైగా భక్తులు జగన్మాతను దర్శించుకున్నారు. ఉత్సవాల ఆరు రోజుల్లో 4.30 లక్షల మందికి పైగా భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నట్లు అంచనా. మంగళవారం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు, సారె తెచ్చి అందజేశారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అమ్మను దర్శించుకున్నారు. బుధవారం మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి రూపంలోని దుర్గమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

★ మంగళవారం అర్ధరాత్రి దాటాక సరస్వతీదేవి రూపంలో అమ్మవారి అలంకారం పూర్తవగానే భక్తులను దర్శనానికి అనుమతించారు. అర్ధరాత్రి నుంచే వేల మంది భక్తులు తరలివచ్చి వినాయక ఆలయం వద్ద ఉన్న బ్యారక్‌లలో వేచి ఉన్నారు. వారిని రాత్రి 12 గంటలు దాటాక క్యూలైన్లలోకి వదిలారు.

భక్తజన సేవలో... అమ్మ వారి దర్శనానికి తరలివస్తున్న లక్షల మంది భక్తుల కోసం నిత్యం ఉచిత అన్నదానం, ప్రసాదాలు, పాలు, నీళ్లు సహా భారీగా మౌలికవసతులను ఏర్పాటు చేశారు. రోజూ 20 వేల మందికి పైగా అన్నప్రసాదం అందిస్తున్నారు.


నగరోత్సవంలో ఉత్సవమూర్తులు

నేడు సరస్వతీదేవిగా..


వెండి వీణతో విద్యాధరిగా కొలువుదీరిన జగన్మాత కనకదుర్గమ్మ (పాతచిత్రం)

దసరా ఉత్సవాల్లో కీలకమైన మూలానక్షత్రం సందర్భంగా దుర్గమ్మ సరస్వతీదేవి రూపంలో బుధవారం దర్శనమివ్వనుంది. మూలానక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం. మహాకాళి, మహాలక్ష్మీ, మహాసరస్వతి శక్తి స్వరూపాలతో దుష్టసంహారం చేసిన తర్వాత దుర్గాదేవిని శరన్నవరాత్రి ఉత్సవాలలో మూలానక్షత్రం రోజున వాగ్దేవతామూర్తి అయిన సరస్వతీ రూపంలో అలంకరిస్తారు. సరస్వతీదేవిని దర్శించుకోవడం ద్వారా విద్యార్థులు వాగ్దేవి అనుగ్రహం పొంది సర్వ విద్యలలో విజయం సాధిస్తారని నమ్మకం. మూలానక్షత్రం నుంచి విజయదశమి వరకు విశేష పుణ్య దినాలుగా భావించి దుర్గమ్మను ఆరాధిస్తారు. భక్తజనుల అజ్ఞానాన్ని పారదోలి జ్ఞానజ్యోతిని వెలిగించే జ్ఞాన ప్రదాయిని సరస్వతీదేవి. సరస్వతీదేవి దర్శనం... అఖిల విద్యాభ్యుదయ ప్రదాయకం.


చదువుల తల్లికి అలంకరించనున్న వీణ

పాత కోర్సులు.. మూస శిక్షణ

- సంస్థల అవసరాలను గుర్తించని వైనం
- అవకాశాలకు తగ్గట్టుగా దొరకని అభ్యర్థులు
- పంథా మారిస్తేనే ఉపాధికి బాటలు

ఈనాడు, అమరావతి


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధి అవకాశాలెన్నో.. మానవ వనరుల లభ్యతా పుష్కలమే.. అయినా ఆయా సంస్థల అవసరాలు తీరడం లేదు. మూస పద్ధతుల్లో ఇస్తున్న శిక్షణే ఇందుకు ప్రధాన కారణం. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటల ఆధారంగా అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో పాటు రసాయనాలు, మెటల్, స్పిన్నింగ్, గ్రానైట్, సిమెంట్ పరిశ్రమలతో పాటు బ్రాండెడ్ దుకాణాలు, ఆతిథ్యం, పర్యాటకం, రవాణా, సేవా రంగాల్లో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వీటికి తగ్గట్టుగా నైపుణ్యం ఉన్న యువత దొరకడం లేదు. వివిధ పరిశ్రమలు ఇతర రాష్ట్రాలు/ప్రాంతాల వారితో ఖాళీలను భర్తీ చేస్తున్నాయి. మరోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నత విద్య పూర్తి చేసినవారు అర్హతకు తగ్గ అవకాశాలు దక్కక ఖాళీగా ఉంటున్నారు.

కేంద్రాలు ఉన్నా.. సమన్వయం లేక..

స్కిల్ హబ్‌లు, నైపుణ్య కళాశాలలు, నైపుణ్య కేంద్రాలు, ముఖ్యమంత్రి నైపుణ్య కేంద్రాలు, సీమెన్స్ శిక్షణ కేంద్రాలు, సీడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రాలున్నా వీటి మధ్య సమన్వయం లేక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పైగా ఈ కేంద్రాలకు అవసరమైన స్థాయిలో యువత రావడం లేదు. వీరిలో ఆశలు, అంచనాలు ఎక్కువగా ఉండడం, ఆ మేరకు శిక్షణ, ఉపాధి కల్పించలేకపోవడమే అసలు సమస్య. సంస్థలు సైతం ఏళ్ల గడుస్తున్నా పాత కోర్సులనే కొనసాగిస్తుండడం, ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా మార్పులు చేయకపోవడం ప్రధాన లోపాలు. ఆయా రంగాలు, పరిశ్రమలతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తే సత్ఫలితాలు సాధించొచ్చు.

జిల్లాలోని కేంద్రాల్లో వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు..

విభాగం	కేంద్రాలు	అభ్యర్థులు
స్కిల్‌హబ్	8	180
స్కిల్ కళాశాల	1	30
పీఎంవిశ్వకర్మ	8	157
స్కిల్ సెంటర్లు	22	473
సీఎం స్కిల్ కేంద్రాలు	10	445
సీమెన్స్ శిక్షణ	3	104
మొత్తం	52	1,389



కోర్సులు ఇలా....

★ డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, ఐటీ సేల్స్ టెలికాలర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్, అసిస్టెంట్ ప్లంబర్, ఫిట్టర్, ఏసీ మెకానిక్, సీసీటీటీ టెక్నీషియన్, అసిస్టెంట్ సర్వేయర్. దర్జీ, కార్పెంటర్, ఇటుకల తయారీ, గోల్డ్‌స్మిత్, దోబీ, బొమ్మల తయారీ, బార్బర్

★ **అకడమిక్:** బేసిక్ పైథాన్ ప్రోగ్రామింగ్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, ట్యాలీ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, అర్థమెటిక్-రీజనింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్కిటెక్చర్, ఎలక్ట్రికల్.

జిల్లా ఉపాధి కార్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలు: 13

చూపించిన ఖాళీలు: 4,260 | ఎంపికైన అభ్యర్థులు: 629

లోపాలివే..

- గత ఆరు నెలలుగా సీడాప్ కింద లక్ష్యం నిర్దేశించకపోవడంతో శిక్షణ నిలిచిపోయింది.
- స్కిల్ హబ్‌లో అంతా మూస పద్ధతే. పదో తరగతి, ఇంటర్ చదివిన వారికి డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ దుకాణాల్లో పని చేయడానికి శిక్షణ ఇస్తున్నారు.
- ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా కంప్యూటర్‌లో ఆటోక్యాడ్, ఉన్నత నైపుణ్యాలపై శిక్షణను యువత కోరుకుంటోంది.
- శిక్షకుల్లో చాలా మందికి అవసరమైన నైపుణ్యాలు లేకపోవడం సమస్యగా మారింది. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కోర్సుల డిజైన్ లేదు.
- ఐటీఐలలో డీజిల్, ఆటోమొబైల్, ఫిట్టర్, ఎలక్ట్రికల్ వంటి కోర్సుల్లో శిక్షణ నాసిరకంగా ఉంటోంది. సరైన నైపుణ్యం లేకుండానే ధ్రువపత్రాలు ఇచ్చేస్తుండడంతో 30 మంది బయటకొస్తే ముగ్గురు నలుగురికి మించి అవకాశాలు దక్కడం లేదు.
- ఉమ్మడి జిల్లాలో ఉన్న రసాయనాలు, సబ్బులు, దూది, కారం, సిమెంట్, గ్రానైట్, స్టీల్ పాత్రల తయారీ, ప్లాస్టిక్ సామగ్రి, విత్తన శుద్ధి, ప్యాకింగ్ తదితర రంగాల్లో ఏటా ఎంత మందికి అవకాశాలు ఉంటాయి? వీరికి ఎలాంటి నైపుణ్యం అవసరమో శిక్షణ కేంద్రాలకు స్పష్టత లేదు.
- వేతనం, పనిచేసే ప్రాంతంపై యువత రాజీ పడడం లేదు.
- తక్కువ వేతనం, ఇతరత్రా ఇబ్బందులు ఉండవన్న ఉద్దేశంతో పరిశ్రమ వర్గాలవారు బయట ప్రాంతాల వారిని తెచ్చుకుంటున్నారు.
- అకౌంటింగ్, మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, రవాణా రంగాల్లో చాలా తక్కువ సంస్థలు మాత్రమే స్థానికులకు అవకాశాలిస్తున్నాయి.

ట్రావెల్స్ బస్సుల్లో.. ఛార్జీల దోపిడీ



న్యూస్‌టుడే, పట్టాభిపురం

తెలుగు ప్రజలు ఇంటిల్లిపాదీ ఆనందోత్సవాలతో జరుపుకొనే పెద్ద పండగల్లో దసరా ఒకటి. సంక్రాంతి తర్వాత విజయదశమికి ఎక్కడెక్కడి వారంతా సొంత ఊళ్లకు వస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు తమకు ఇష్టం వచ్చిన విధంగా ఛార్జీలు పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. 12న విజయదశమి కావడంతో 9, 10, 11 తేదీల్లో వివిధ నగరాల నుంచి గుంటూరుకు వచ్చేవారు ఎంతో మంది ఉంటారు. విశాఖపట్టణం, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. రైళ్లల్లో బెర్తులు ఎప్పుడో నిండిపోవడంతో ప్రత్యామ్నాయంగా బస్సుల్నే ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ట్రావెల్స్ బస్సుల నిర్వాహకులు ఛార్జీలు అమాంతం పెంచేశారు. ప్రయాణికుల నుంచి అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నారు.

ట్రావెల్స్ బస్సు ఆపరేటర్ల ఛార్జీలు (రూ.) ఇలా..	సాధారణ రోజుల్లో	దసరా పండగకు
హైదరాబాద్-గుంటూరు	500-700	1000-2000
విశాఖ-గుంటూరు	600-800	1500-2000
చెన్నై-గుంటూరు	800-900	2000-2500
బెంగళూరు-గుంటూరు	1000-1200	2500-3000

అదనపు భారమే..

పొరుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో జిల్లాకు చెందిన ఎంతో మంది వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఉన్నత చదువుల నిమిత్తం విద్యార్థులు బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్టణం వంటి నగరాలకు వెళ్లారు. దసరా పండగకు ఇంటికి వెళ్లి బంధుమిత్రులతో సరదాగా గడుపుదామని వివిధ నగరాల నుంచి పయనమవుతున్న వారి నుంచి ట్రావెల్స్ బస్సుల ఆపరేటర్లు ఛార్జీల రూపంలో దండుకుంటున్నారు. సాధారణ రోజుల్లో వసూలు చేసే ఛార్జీల కంటే రెట్టింపు చేసి దోచుకుంటున్నారు. సొంత ఊరికి రావాలనే ఉత్సుకతతో ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు అడిగినంత సొమ్ము ముట్టచెప్పి టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు. తిరిగే వెళ్లే సమయంలో టిక్కెట్లు దొరుకుతాయో లేదోనని 13వ తేదీకి ఇప్పుడే బుక్ చేసుకుంటున్నట్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఒకరు తెలిపారు. సాధారణంగా ఆదివారాల్లో డిమాండ్ బాగా ఉంటుంది. దసరా తర్వాత తిరుగు ప్రయాణం ఆదివారం కలిసి రావడం వల్ల డిమాండ్ మరీ అధికంగా ఉంది. దీంతో ప్రైవేటు బస్సు ఆపరేటర్ల వ్యవహారం ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. ఆదివారం గుంటూరు నుంచి బెంగళూరు వెళ్లేందుకు టికెట్ అడిగితే రూ.3700-5000 అడిగారని ఓ విద్యార్థి వాపోయారు.

జిల్లాను అగ్రగామిగా నిలపాలి

అందరి సలహాలతో స్వర్ణాంధ్ర 2047 ప్రణాళిక

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



స్వర్ణాంధ్ర-2047 సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మహనోర్, పక్కన ఎంపీ అయోధ్యరామిరెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047కు జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే 58,778 మంది సలహాలు, సూచనలు క్యూఆర్ కోడ్ ద్వారా పంచుకున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో స్వర్ణాంధ్ర 2047 ప్రణాళిక రూపకల్పనపై స్టేక్ హోల్డర్స్‌తో మంగళవారం సమావేశమయ్యారు. సమావేశానికి జేసీ ఎ.భార్గవ్ తేజ అధ్యక్షత వహించి స్వర్ణాంధ్ర 2047కు సంబంధించి శాఖలవారీగా రూపకల్పన చేసిన ప్రణాళికను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో గుంటూరు జిల్లా అద్భుతమైన పాత్ర పోషించనుందన్నారు. అమరావతి రాజధాని ఏర్పాటు నేపథ్యంలో ఈ ప్రాంతంలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై ప్రణాళిక, సేవా రంగాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పన, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు తదితర అంశాలపై చర్చించామన్నారు. చేనేత, పర్యాటక రంగాలపై దృష్టి సారించామని, రానున్న రోజుల్లో జాతీయ హ్యాండ్‌లూమ్స్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసి నేతన్నకు భరోసా కల్పిస్తామన్నారు. ప్రణాళిక ప్రకారం ఏడాదికి 15 శాతం వృద్ధి చెందేలా చూస్తూ.. రాష్ట్రాన్ని మొదటి స్థానంలో ఉండేలా చేస్తామన్నారు. పర్యాటకంగాను జిల్లాను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఆర్ఐలు జిల్లాకు మంచి ప్రతిపాదనలు తేవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పౌరసరఫరాల సంస్థ నిర్వహిస్తుందని, టార్పాలిన్లు రాయితీపై అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రణాళిక బాగుందని, లక్ష్యాల మేరకు అభివృద్ధి సాధిస్తే దేశంలోనే గుంటూరు గొప్ప జిల్లాగా ఏర్పడుతుందన్నారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ 2047 మిషన్ ఏర్పాటుపై అధికారులు ప్రణాళికలు సమర్పించాలన్నారు.

అమరావతిలో ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి యూనివర్సిటీని అమరావతిలో ప్రభుత్వమే ఏర్పాటు చేయాలన్నారు. గుంటూరు రూరల్ మండలంలో అనధికారికంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. జడ్పీ ఛైర్‌పర్సన్ క్రిస్టినా మాట్లాడుతూ జడ్పీ నిధుల నుంచి రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యానికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ గుంటూరులో యూజీడీని అభివృద్ధి చేయాలన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ పాడి, పంటల రైతులకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, పౌరసరఫరాల సంస్థ జీఎం లక్ష్మి, డీఎస్‌వో కోమలి పద్మ, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ పాల్గొన్నారు.

తల్లి మరణం తట్టుకోలేక కుమారుడి ఆత్మహత్య

పట్నంబజారు, న్యూస్‌టుడే: తల్లి మరణాన్ని తట్టుకోలేని కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇది. పాతగుంటూరు పోలీసుల కథనం ప్రకారం.. ఇజ్రాయేల్‌పేటకు చెందిన మోహమాటం లక్ష్మి (53) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతిని తట్టుకోలేని అవివాహిత ఏకైక కుమారుడు పవన్‌కుమార్ (34) తల్లి వేసుకునే రక్తపోటు బిళ్లలు ఎక్కువగా మింగాడు. వెంటనే ఆసుపత్రిలో చేర్చగా.. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందారు. పాతగుంటూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు చర్యలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం సాయంత్రం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలో వచ్చిన ప్రాంతాలను కలిపి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



కోర్టులు సిద్ధం చేస్తూ...

మంగళగిరి, న్యూస్‌టుడే : రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సహకారంతో తెలుగు యువత ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 12 వరకు మంగళగిరిలో రాష్ట్రస్థాయి కబడ్డీ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నగర శివారు కాళీమాత ఆలయ సమీపంలోని ఖాళీ స్థలంలో నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. మహిళలు, పురుషుల వేర్వేరు విభాగాల్లో జరిగే ఈ పోటీలు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 వరకు జరుగనున్నాయి.

కామన్‌వెల్త్ ఎక్యూప్డ్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు అర్హత



సాదియా అల్మాస్

మంగళగిరి, న్యూస్‌టుడే : సౌత్ ఆఫ్రికా సన్‌సిటీలో ఈ నెల 8 నుంచి 13 వరకు కామన్‌వెల్త్ ఎక్యూప్డ్ పవర్‌లిఫ్టింగ్ సబ్ జూనియర్ అండ్ జూనియర్ పోటీలు జరుగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్మాస్ అర్హత సాధించారు. జూనియర్ ఎక్యూప్డ్ పవర్‌లిఫ్టింగ్ 57 కిలోల విభాగంలో సాదియా పాల్గొంటున్నారని జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ భాస్కర్‌రావు, షేక్ సందాని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ధనలక్ష్మీ పాహిమాం!



ఏటీ అగ్రహారం ఒకటో లైన్‌లోని శ్రీకంచికామకోటి పీఠ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరంలో అమ్మవారిని ధనలక్ష్మీగా అలంకరించారు. నల్లపు కాశీ శివనాగభూషణరెడ్డి దంపతులు రూ.45 లక్షలతో అమ్మవారిని అలంకరించారు. -న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

దుగ్గిరాలలో 47.6 మి.మీ వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు సగటున 3.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దుగ్గిరాల మండలంలో 47.6, పొన్నూరు 7.4, తెనాలి 2.8, కొల్లిపర 2.2, చేబ్రోలు 1.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

14 నుంచి పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలను జిల్లాలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, రూ.15.35 కోట్లతో 176 పనులకు పరిపాలన మంజూరు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 160 సీసీ రోడ్లు, 16 సీసీ డ్రెయిన్ల పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వీసీలో డ్వామా పీడీ శంకర్, డీపీవో సాయికుమార్, జడ్పీ సీఈవో జ్యోతిబసు, పంచాయతీరాజ్ ఎస్ఈ గుర్రం బ్రహ్మయ్య పాల్గొన్నారు.

లాభాల పట్టు



మేడికొండూరు, న్యూస్‌టుడే

మేడికొండూరు మండలం భీమినేనివారిపాలెంకు చెందిన ఈదర రవీంద్రబాబు తొలుత వాణిజ్య పంటలు సాగు చేసేవారు. అవి లాభసాటిగా లేకపోవడంతో వాటికి స్వస్తి చెప్పారు. ప్రత్యామ్నాయంగా పట్టు పురుగుల పెంపకం ఎంచుకున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం అందుకుంటూ, మెలకువలు పాటిస్తూ మంచి రాబడి పొందుతున్నారు. అందుకు సంబంధించిన అనుభవాలను రైతు పంచుకున్నారు.

ఆయన సొంత పొలం 6 ఎకరాల్లో మల్బరీ తోట వేశారు. అక్కడే ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసి పట్టు పురుగులు పెంపకం ప్రారంభించారు. రెండు నెలల కిందట పురుగులు తెచ్చారు. మల్బరీ ఆకు వేశారు. నెల రోజుల్లో పట్టు గూళ్లు తయారయ్యాయి. నెలకు ఒకటి చొప్పున ఏడాదికి మొత్తంగా పది విడతల్లో పట్టు పురుగులు పెంచుకోవచ్చు. ఏప్రిల్, మే నెలల్లో మాత్రం పట్టు పురుగులు ఎండను తట్టుకోలేవు. ఇలా సంవత్సరానికి పది సార్లు దిగుబడి వస్తుంది. ప్రతి నెలా ఆదాయం ఉంటుంది.




మల్బరీ తోట తయారైన పట్టు గూళ్లు

ఆదాయం బాగు...

-రవీంద్రబాబు, రైతు

షెడ్డు కట్టేందుకు రూ.8 లక్షల దాకా ఖర్చయ్యింది. మల్బరీ తోటకు రెండేళ్లకుగాను రూ.6 లక్షలు దాకా వ్యయమైంది. అలా మొత్తంగా రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టా. రెండు నెలల కిందట కర్ణాటక రాష్ట్రం విజయపురి నుంచి పీబీ రకం పట్టు పురుగులు 200 రౌండ్లు రూ.2600 పెట్టి తీసుకొచ్చా. రవాణా ఖర్చు రూ.1,600 అయ్యింది. పురుగులు వేసిన 25 రోజులకు గూళ్లు తయారయ్యాయి. మొదటి విడతలో 1.21 క్వింటాళ్ల పట్టు దిగుబడి వచ్చింది. కర్ణాటక రాష్ట్రం రామ్‌నగర్ మార్కెట్లో సరకు అమ్మగా రూ.42 వేలు వచ్చాయి. మరోసారి పట్టు పురుగులు తెచ్చి పెంచుతున్నా. ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ పథకం ద్వారా రెండు ఎకరాల్లో మల్బరీ మొక్కలు పెంచినందుకు ఇప్పటికి రూ.90 వేలు వచ్చాయి. షెడ్డు నిమిత్తం రూ.6 లక్షల దాకా వస్తాయని అధికారులు చెప్పారు. జాగ్రత్తలు తీసుకుంటే పట్టు గూళ్ల పెంపకం మంచి ఆదాయాన్ని ఇస్తుంది.



రాయితీ ప్రయోజనం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టు పురుగుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. మల్బరీ తోట, పట్టు పురుగుల పెంపకం, పరికరాలు, షెడ్డు నిర్మాణం, పురుగులకు వ్యాధి నిరోధక మందులు వంటి వాటికి వివిధ రూపాల్లో రాయితీ అందిస్తున్నాయి. యూనిట్ ఖర్చును బట్టి రాయితీ అందుతుంది. ఖర్చులో సాధారణ రైతుకు 75 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీ అందుతుంది. అధికారుల సూచనలు అమలు చేస్తూ.. మెలకువలు పాటిస్తే పట్టుపురుగుల పెంపకం బాగుంటుంది. భీమినేనివారిపాలెం, పొన్నెకల్లు, చంఘీస్‌ఖాన్‌పేట, బెల్లంకొండ తదితర ప్రాంతాల్లో రైతులు పట్టు పురుగులు పెంచుతున్నారు.


– ఎ.సుబ్రహ్మణ్యం, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి

టమాటాలో కాయ తొలుచు పురుగు కట్టడి చేద్దాం



టమాటాను కాయతొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. దీనివల్ల కాయల నాణ్యత తగ్గుతుంది. పర్యవసానంగా రైతుకు సరైన ఆదాయం లభించదు. ఈ పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఉద్యానశాఖ విస్తరణాధికారి శ్రీధర్‌రెడ్డి వివరించారు. టమాటాలో అంతరపంటగా బంతి వేయాలి. ఇది ఎరగా పనిచేస్తుంది. చేలో పంటను ప్రారంభించే 20 రోజుల ముందే ప్రతి 16 వరుసల తర్వాత బంతి వచ్చేలా నాటాలి. ఎకరానికి 4 లేదా 5 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. నాటిన 25 నుంచి 35 రోజులకు ఫ్లూబెండమైడ్ 0.3 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి చేనంతా పిచికారీ చేయాలి. ఎకరానికి 20 పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలి. పురుగులను ఏరి నాశనం చేయాలి.

– దుగ్గిరాల, న్యూస్‌టుడే



పత్తి పంటను గులాబీ రంగు కాయతొలుచు పురుగు ఆశిస్తుంది. నివారణ ఎలా?

- పుట్టి చెంచయ్య, పెదపరిమి,

సలహా: పత్తి పంట ప్రస్తుతం 90 నుంచి 100 రోజుల వయసులో ఉంది. ఇప్పుడు గులాబీ రంగు కాయ తొలుచు పురుగు ఆశించి నష్టపర్చే అవకాశముంది. దీని నివారణ చేపట్టాలి. ఎకరానికి 10 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసి గుంపు ఆకర్షణ పద్ధతిలో మగ రెక్కల పురుగులను నివారించాలి. బుట్టలు పంట కంటే ఒక అడుగు ఎత్తు ఉండాలి. నెల రోజులకోసారి బుట్టల ట్యూబ్ మార్చుకోవాలి. ఎకరానికి 10 లింగాకర్షణ బుట్టలు, వీలు కాకపోతే కనీసం నాలుగైనా ఏర్పాటు చేసుకోవాలి. రెక్కల పురుగులపై నిఘా ఉంచాలి. బుట్టకి 8 రెక్కల పురుగులు 2 లేదా 3 రోజులు వరుసగా పడినా లేదా 10 శాతం గుడ్డి పూలు గమనించినా లేదా 10 శాతం కాయ పుచ్చు గమనించినా వెంటనే పంట 120 రోజుల వయసులో ఉన్నప్పుడు ఎకరానికి కోరోబాన్(20 ఈసీ) 500 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ (40 ఈసీ) 400 మి.లీ. పిచికారీ చేసుకోవాలి. పంట 120 రోజులు దాటిన తర్వాత పైన పేర్కొన్న నష్టాన్ని గమనిస్తే సైపర్‌మెత్రిన్(10ఈసీ) 400 మి.లీ/25 ఈసీ 200 మి.లీ. లేదా లామ్డా సైహలోత్రిన్ 200 మి.లీ. ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. పత్తి పొలంలో పాత పత్తి కట్టెను ఉంచకూడదు. దానిని తగలబెట్టాలి. పొలాలకు దగ్గరలో జిన్నింగ్ మిల్లులో గుడ్డి పత్తి రాశులు లేకుండా చూడాలి. – డాక్టర్ ఎం.నగేష్

– న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు(గుంటూరు)

వరిలో జింకు లోప నివారణ చర్యలు



వరి పైరులో జింకు లోప నివారణకు చేపట్టాల్సిన చర్యలను పొన్నూరు వ్యవసాయశాఖాధికారి డేగల వెంకటరామయ్య తెలిపారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలతో వరి పైరు వారం రోజులపాటు పూర్తిగా నీట మునిగింది. రోజుల తరబడి పైరు మురుగు నీటిలో ఉంది. ఫలితంగా వరి పైరు సాగు చేసిన భూముల్లో ఎక్కువ భాగం జింకు లోపం కనిపిస్తోంది. జింకు లోపంతో ఈనె ఆకుపచ్చ రంగు కోల్పోయి పసుపు వర్ణంగా మారి ఆకుల చివర్లో తుప్పు రంగు కనిపిస్తోంది. అనంతరం చిన్న చిన్న మచ్చలన్నీ కలిసిపోయి ఆకు అంతటా వ్యాపించి పంట దిగుబడులపై ప్రభావం చూపుతాయి. దీని నివారణకు 0.2 శాతం జింకు సల్ఫేట్ ద్రావణాన్ని లీటరు నీటిలో 2 గ్రాములు కలిపి వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలి. – పొన్నూరు, న్యూస్‌టుడే

డీఎస్ఎన్ మూర్తికి ఎ.ఆర్.కృష్ణ పురస్కారం



మూర్తిని సత్కరిస్తున్న సత్యనారాయణ, సాంబశివరావు, సాయిమాధవ్, మల్లేశ్వరరావు, వరప్రసాద్

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కళలకాణాచి, తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్ విజయవాడ ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ స్థాయి నాలుగో పద్య, సాంఘిక, నాటక, నాటికల పోటీలు రెండో రోజు మంగళవారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కొనసాగాయి. ఈ సందర్భంగా పద్మభూషణ్ ఎ.ఆర్.కృష్ణ జాతీయ రంగస్థల పురస్కార ప్రదానం, విపంచి పుస్తక, రంగవీక్షణం గ్రంథావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రదర్శించనున్న నాటికలను విపంచి పేరుతో తీసుకొచ్చిన సంకలనం చాలా ఉపయుక్తమని వక్తలు సూచించారు. వర్తమాన నాటకరంగంపై వచ్చిన సమీక్ష వ్యాస సంపుటి గ్రంథం రంగవీక్షణం దర్పణమని వారు పేర్కొన్నారు. పురస్కార గ్రహీత డీఎస్ఎన్ మూర్తి వారి నూరేళ్ల తెలుగునాటక రంగం డాక్యుమెంటరీ రంగస్థలం ప్రదర్శన దేశ నాటక రంగంలోనే తొలి ప్రదర్శనని వక్తలు పేర్కొన్నారు. అభో విభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణ, సినీమాటల రచయిత, కళలకాణాచి తెనాలి వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్రా సాయిమాధవ్, రచయితలు ఆకుల మల్లేశ్వరరావు, గోపరాజు విజయ్, వి.వి.ఎన్.ఆర్.ఎస్.ఎస్.ఎస్.వరప్రసాద్, కందిమళ్ల సాంబశివరావు ఎ.ఆర్. కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని డీఎస్ఎన్ మూర్తికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని ఘనంగా సత్కరించి జ్ఞాపిక, నగదు పురస్కారాన్ని అందజేశారు.

సామూహిక అత్యాచారం కేసులో..

ఇద్దరికి 20 ఏళ్లు, మరొకరికి 3 ఏళ్లు జైలు

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: భర్తతో కలిసి వెళ్తున్న ఓ వివాహితపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఓ ముఠాలోని ఇద్దరికి 20 ఏళ్లు, మరొకరికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.నీలిమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణం, సమీపం చినకుదురుకు చెందిన ఆకుల లింగమయ్య, దాసరి ఓబులేశు, ఇండ్ల రమణ, దాసరి సుంకన్నతోపాటు మరో మైనర్ రాష్ట్ర వ్యాప్తంగా పలు నేరాలకు పాల్పడ్డారు. దారిదోపిడీలకు పాల్పడి మహిళలపై దాడులు చేసేవారు. 2021 సెప్టెంబరు 8న పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన భార్యాభర్తలు మేడికొండూరు సమీపంలోని పాలడుగులో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వస్తున్నారు. మార్గమధ్యలో చెట్టుకొమ్మలను రోడ్డుకు అడ్డంగా వేయడంతో ద్విచక్రవాహనం నెమ్మదించగా.. మాటున వేసిన నిందితులు చీకట్లో నుంచి రోడ్డుపైకి వచ్చి వారిపై కర్రను విసరడంతో వాహనం నుంచి కిందపడ్డారు. వేటకొడవళ్లతో దాడిచేసి సమీపంలోని పొలాల్లోకి లాక్కెళ్లి వారి వద్ద ఉన్న నగదు, బంగారం దోచుకున్నారు. అర్ధరాత్రి వరకు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడి పరారయ్యారు. మరుసటిరోజు ఆమె మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదయింది. ఈ సంఘటన జరిగిన కొద్దిరోజులకు నిందితులు యడ్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలో మరో నేరానికి పాల్పడటంతో అక్కడి పోలీసులు వీరిని అరెస్టు చేసి ఆరా తీయగా ఈ నేరానికి కూడా వారే పాల్పడినట్లు నిర్ధారించారు. ఈ మేరకు నలుగురు నిందితులను అరెస్టు చేయగా మరో నిందితుడు దాసరి సుంకన్న పరారీలో ఉన్నారు. బాలుడిపై కేసును ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. నిందితులు లింగమయ్య, ఓబులేశులపై అత్యాచారం నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.66వేల జరిమానా విధించారు. మరో నిందితుడు రమణకు మూడేళ్ల జైలు శిక్ష రూ.5వేలు జరిమానా విధిస్తూ జడ్జి నీలిమ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.కృష్ణ ప్రాసిక్యూషన్ నిర్వహించగా అప్పటి మేడికొండూరు సీఐ కె.మారుతీకృష్ణ కేసు దర్యాప్తు చేశారు.

కటకటాల్లోకి.. కామాంధుడు



వివరాలు వెల్లడిస్తున్న తూర్పు విభాగపు డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు, న్యూస్‌టుడే: తాను పోలీసు అని నమ్మబలికి విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డ యువకుడ్ని మంగళవారం కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం లాలాపేట పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో తూర్పు విభాగపు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ వివరాలు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన విద్యార్థిని గుంటూరు నగరంలోని ఒక కాలేజీలో చదువుతోంది. ఈనెల 4వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఆ విద్యార్థిని, తన స్నేహితునితో కలిసి ద్విచక్రవాహనంపై కాఫీ తాగేందుకు బస్టాండు సెంటర్‌కు వచ్చి వెళుతుండగా.. గుర్తు తెలియని యువకుడు నంబరు ప్లేటు లేని ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెను బెదిరించి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. కొత్తపేట పోలీసులకు కేసు దర్యాప్తు చేపట్టారు. బస్టాండు పరిసర ప్రాంతాల్లోని సీసీకెమెరాలను పరిశీలించి సంఘటనకు పాల్పడింది చేబ్రోలు మండలం వేజండ్లకు చెందిన పోతినేని గోపీగా గుర్తించారు. మంగళవారం అతన్ని అరెస్టు చేశారు. గోపీపై గతంలో గొలుసు, ద్విచక్రవాహనాల దొంగతనాలు వాటి మొత్తం 23 కేసులు ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవించినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన కొత్తపేట సి.ఐ. వీరయ్య, ఎస్.ఐ.రమేష్, హెడ్ కానిస్టేబుళ్లు యం.కోటేశ్వరరావు, కె.కోటేశ్వరరావులను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

'స్విగ్గితో కలిసి వ్యాపారం చేయం'

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్విగ్గిని ఈ నెల 14 నుంచి బాయ్‌కాట్ చేయాలని తమ సంఘం నిర్ణయించిందని ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఈదర వెంకటపూర్ణచంద్ తెలిపారు. తెనాలిలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సంస్థ జీరో కమీషన్ అంటూ వ్యాపారం ప్రారంభించి ఇప్పుడు 30 శాతం కమీషన్ తీసుకోవటమే కాకుండా దానిపైనా జీఎస్టీ వేసి వసూలు చేయటం, వ్యాపారులకు తెలియకుండా ఆఫర్లు పెట్టటం, యాడ్స్ సేకరణ వంటి పనులు చేస్తుందన్నారు. అందువల్ల హోటళ్ల వారు ప్రత్యామ్నాయంగా జొమాటోను వాడుకోవాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

ఎనిమిది మంది ఎస్సైల బదిలీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లాలో ఎనిమిది మంది సబ్ ఇన్‌స్పెక్టర్ల (ఎస్సై)ను బదిలీ చేస్తూ ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ఎస్సైలను తమకు కేటాయించిన ప్రాంతంలో వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించారు.

పేరు	ప్రస్తుతం ఉన్న చోటు	బదిలీ ప్రాంతం
టి.వెంకటరావు	జిల్లా వీఆర్	డీసీఆర్బీ, గుంటూరు
సీహెచ్‌రాజ్యలక్ష్మి	జిల్లా వీఆర్	పీసీఆర్, తెనాలి
కె.రంగారావు	జిల్లా వీఆర్	అరండల్‌పేట పోలీసుస్టేషన్
టి. భవానీ	జిల్లా వీఆర్	మహిళా పోలీసుస్టేషన్
ఎస్. కోటయ్య	జిల్లా వీఆర్	తాడేపల్లి పోలీసుస్టేషన్
ఎన్.సి ప్రసాద్	జిల్లా వీఆర్	తుళ్లూరు ట్రాఫిక్
ఎ. మధుపవన్	పట్టాభిపురం	పెదనందిపాడు
ఎన్. నరహరి	పెదనందిపాడు	పట్టాభిపురం

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

మంత్రి నారా లోకేశ్ 'ప్రజా దర్బార్' నేడు

తాడేపల్లి, న్యూస్‌టుడే : ఉండవల్లి నివాసంలో మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ ఈ నెల 9న 'ప్రజాదర్బార్' నిర్వహిస్తున్నట్లు తెదేపా నియోజకవర్గ కార్యాలయం నుంచి మంగళవారం ఓ ప్రకటన విడుదలైంది. ఉదయం 6 నుంచి 7 వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలను మంత్రి నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుంటారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 7 లోపు వచ్చిన వారికి మాత్రమే అవకాశం ఉంటుంది.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందిస్తున్న తెదేపా పట్టణ అధ్యక్షుడు వెంకట్రావు

తాడేపల్లి, న్యూస్‌టుడే : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తెదేపా బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్‌కు మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును తెదేపా పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు స్థానిక కార్యాలయంలో మంగళవారం బాధితుడికి అందజేశారు. కేళి వెంకటేశ్వరరావు, అద్దంకి మురళీ, మేకా పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాడికొండ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : తాడికొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ప్రజా దర్బార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పలువురు అర్జీదారుల నుంచి ఆయన స్వయంగా వినతులు స్వీకరించారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : దిల్లీలో సీఎం చంద్రబాబు నాయుడును ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు మంగళవారం కలిశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అధికార భవనం సమావేశపు హాలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

బిల్లులు విడుదల చేయాలని వినతి

తాడేపల్లి, న్యూస్‌టుడే : వైకాపా హయాంలో నిలిపివేసిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ఉపాధి హామీ మండలి మాజీ సభ్యులు వీరంకి వెంకట గురుమూర్తి, శ్రీనివాస్ మూర్తి, పోతంశెట్టి వీరయ్య, ముప్పా లక్ష్మీ సుభాషిణి కోరారు. ఈ మేరకు మంగళవారం తాడేపల్లిలో పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ, డైరెక్టర్ షణ్ముఖ కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లులు విడుదలకు సాంకేతిక పరమైన ఇబ్బందులను తొలగించి ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రికి వివరించి బిల్లులు విడుదల చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఉప్పలపాడు వీఆర్వోగా ప్రమీల

పెదనందిపాడు, న్యూస్‌టుడే : పెదనందిపాడు మండలం ఉప్పలపాడు వీఆర్వోగా ఆర్. ప్రమీల మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె చేబ్రోలు మండలం వేజెండ్ల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. సర్వేయర్లుగా గోపి(పెదనందిపాడు), మేరీ జోన్స్(కొప్పర్రు), రవి చంద్ర(వరగాని) కూడా విధుల్లో చేరారు.

ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ



మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి పట్టణ, మండలంలోని 70 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను తెలుగు మహిళా నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక తెదేపా నియోజకవర్గ కార్యాలయంలో వీటిని అందజేశారు. ఇప్పటి వరకు 64 బృందాలకు 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలందరికీ మిషన్లను ఉచితంగానే అందజేసి స్వయం ఉపాధి కల్పించారు. **- న్యూస్‌టుడే, మంగళగిరి**

ఉగ్గపట్టి ఉండాల్సిందే...!

- మహిళలు ఇళ్లకు వెళ్లే వరకు ఇబ్బందే
- మంగళగిరి, తాడేపల్లిలో మరుగుదొడ్లు లేక అవస్థలు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే

వివిధ పనుల నిమిత్తం మంగళగిరి, తాడేపల్లికి వచ్చే మహిళలకు మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం వేలాది మంది ఇక్కడికి వస్తుంటారు. అందులో ముఖ్యంగా స్త్రీలు ఉంటారు. రెవెన్యూ, మండల పరిషత్, పోలీసు, నగరపాలక, విద్యుత్తు, సబ్ రిజిస్ట్రార్, విద్యా శాఖ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన వారు తమ పని పూర్తి చేసుకునే వరకు ఎక్కువ సమయం ఇక్కడే నిరీక్షించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఒకటికి, రెండుకు వెళ్లాలంటే మరుగుదొడ్లు లేక మహిళలు పడరాని పాట్లు పడుతున్నారు. కేవలం బస్‌స్టాండ్ సమీపంలో మాత్రమే సామూహిక మరుగుదొడ్లు ఉన్నాయి. అవి వ్యాపార కేంద్రాలకు దూరంగా ఉన్నాయి. రద్దీగా ఉండే ప్రాంతంలో లేకపోవడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు.

నిత్యం తాళాలు వేసి...

నగరంలో ప్రజావసరాలు తీర్చేందుకు గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం రద్దీ ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా తగిన సౌకర్యాలు కల్పించలేదు. మంగళగిరి నగరపాలక కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే మహిళలకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. ఫలితంగా వారికి అసౌకర్యం తప్పడం లేదు. మార్కెట్, బస్‌స్టాండ్ కూడల్లో ఉన్నవి ఇక్కడకు వచ్చే వారందరికీ సరిపోవు. చేపల మార్కెట్ వద్ద నిర్మించినా ఫలితం లేదు. వాటికి నిత్యం తాళాలు వేసి ఉంచుతున్నారు. వడ్లపూడి సెంటర్‌లో అసలు మరుగుదొడ్ల జాడేలేదు. నగర ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వారి సౌకర్యార్థం అధికారులు వీటి ఏర్పాటుపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బస్‌స్టాండ్ పక్కన ఇరుకుగా ఉన్న సామూహిక మరుగుదొడ్లు

రాష్ట్ర కార్యాలయాల వద్ద ఇదే పరిస్థితి

రాజధాని ప్రాంతం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి అనేక పనులపై పలువురు తాడేపల్లి, మంగళగిరి వస్తుంటారు. వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలన్నీ ఇక్కడే ఉన్నాయి. దీంతో తమ పని ముగించే వరకు ఇక్కడే వేచి ఉండాల్సి ఉంటుంది. ఫలితంగా మరుగుదొడ్లు ఎక్కడున్నాయో? తెలియని పరిస్థితి నెలకొంది. మహిళలు వీటి గురించి ఇతరులను అడగలేక అవస్థలు పడుతున్నారు.

సిబ్బందికి మాత్రమే అని...

కొన్ని కార్యాలయాల్లో అయితే సిబ్బందికి మాత్రమే అని బోర్డులు రాసి ఉంటాయి. దీంతో ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. తాడేపల్లి, మంగళగిరి పరిధిలో సుమారు 50కిపైగా రాష్ట్రస్థాయి కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల వద్ద బయట సామాహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తే వివిధ పనులపై వచ్చిన వారు దిక్కులు చూడాల్సిన అవసరం ఉండదు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు అందుబాటులో అధికారులు దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

లఘు చిత్రాలకు ఉత్తమ పురస్కారాలు



ధ్రువపత్రాలు అందుకుంటున్న నటులు

తాడేపల్లి: విజయవాడలో ఈ నెల 6న లఘు చిత్ర వేడుకలు జరిగాయి. ఇందులో మండలంలోని కొలనుకొండకు చెందిన ఛాయా చిత్రకారుడు బళ్లా అశోక్ రూపొందించిన రెండు చిత్రాలకు ఉత్తమ పురస్కారాలతో పాటు అందులో నటించిన బాలుడికి ఉత్తమ నటుడిగా అవార్డును అందించారు

260వ రోజు అన్నక్యాంటీన్



భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే : దుగ్గిరాలలో దాతల వితరణతో అన్న క్యాంటీన్ ఏర్పడి 250 రోజులు దాటిపోయాయి. మంగళవారం ప్రవాస భారతీయుడు కాట్రగడ్డ శివరామకృష్ణ వితరణతో 260వ రోజు ప్రజలకు భోజనం పెట్టారు. త్వరలోనే క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వం చేపట్టబోతోందని స్థానిక తెదేపా నాయకులు తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత



ఉపకార వేతనాలను పొందిన వారితో దాత వెంకట్

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే : ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'చేయూత' కార్యక్రమం ద్వారా మండలంలోని పుల్లడిగుంటలో పేద విద్యార్థులకు మంగళవారం ఉపకార వేతనాలను అందించారు. ఫౌండేషన్ తరఫున దాత వెంకట్ జిల్లెళ్లమూడి రూ.5 లక్షలను ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 50 మంది విద్యార్థులకు అందించినట్లు ఉప్పుటూరి చినరాములు చెప్పారు. ఉపాధ్యాయులు బండి నాగేశ్వరరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అవగాహనతో గ్రామాల్ని అభివృద్ధి చేసుకుందాం



దుగ్గిరాల: శిక్షణ పొందిన వారితో ఎంపీపీ జబీన్, అధికారులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే : పంచాయతీరాజ్ చట్టాల గురించి అవగాహన పెంచుకుని గ్రామాల్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు జరిగిన శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, సూపరింటెండెంట్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : ప్రభుత్వ అధికారులు న్యాయబద్ధంగా పని చేయాలని జడ్పీటీసీ సభ్యుడు విప్పల కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండ్రోజుల శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ... ఒక్క దగ్గర పెట్టకుని విధుల బాధ్యతగా నిర్వహించాలని, రాజకీయ నాయకులు చెప్పారని అడ్డగోలుగా తప్పులు చేస్తే ఇబ్బంది పడతారని వ్యాఖ్యలు చేయడంతో శిక్షణకు హాజరైన వారంతా ఆశ్చర్య వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ షేక్.ఖాజా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు: మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

మేడికొండూరు, న్యూస్‌టుడే : మేడికొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు జరుగుతున్న శిక్షణ మంగళవారంలో ముగిసింది. డీపీఆర్‌సీ పద్మజరాణి, ఈవోపీఆర్డీ పూర్ణశంకరరావు, ఎంపీడీవో చందన తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా.. ప్రయోజనం సున్నా

దుగ్గిరాల, న్యూస్‌టుడే

ఇది దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డు. పసుపు వ్యాపార పరంగా దేశంలోనే పేరొందిన మార్కెట్‌లలో ఒకటి. రాష్ట్రంలో అయితే పసుపు క్రయ విక్రయాల్లో పెద్ద మార్కెట్ యార్డు. దివంగత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మార్కెట్ యార్డులు రైతులకు మేలు కలిగించేవిగా ఉండాలని భావించారు. దీంతో కర్షకులు నేరుగా యార్డుకు వచ్చే సకల వసతులూ కల్పించారు. దీనివల్ల హోలికులకు గిట్టుబాటు వస్తుందనే ఉద్దేశంతో ఆయన మార్కెటింగ్ శాఖ అభివృద్ధికి నిధులు కేటాయించే వాళ్లు. ఈ నేపథ్యంలో గత వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యార్డులో ఆదాయం ఉన్నా రైతులకు చేసిన మేలు మాత్రం ఏమీ లేదు. కర్షకులకు మొండిచేయి చూపారు.

గతంలో అనుసంధాన రోడ్లకూ ప్రాధాన్యం

యార్డులు అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం కాకుండా వారికి సౌకర్యాలు కల్పించేవిగా ఉండాలని దివంగత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే సంకల్పించారు. ఈ క్రమంలో అనుసంధాన రోడ్లు, పశు వైద్య కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. అంతిమంగా కర్షకునికి మేలు జరగాలన్నదే ఆయన లక్ష్యం. అప్పట్లో ఏడాదికి కనీసంగా మూడు, నాలుగు పశు వైద్య శిబిరాలు జరిగేవి. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు తెచ్చుకోవడానికి ఇబ్బంది లేకుండా పొలాలను, ప్రధాన రహదారులను కలిపే డొంక రోడ్లకు యార్డు నుంచి నిధులు వెచ్చించేవారు.

వైకాపా హయాంలో నిర్వాకం



దుగ్గిరాల మార్కెట్ యార్డు కార్యాలయం

గత ఐదేళ్లలో దుగ్గిరాల యార్డుకు వచ్చిన ఆదాయం

2019–20	రూ.3.06 (కోట్లలో)
2020–21	రూ.0.51
2021–22	రూ. 2.18
2021–22	రూ.2.80
2023–24	రూ.3.16

ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు

గత ఐదేళ్లలో దుగ్గిరాల యార్డుకు నిధులు వస్తున్నా వైకాపా ప్రభుత్వం ఒక్క పైసా కూడా రైతుల కోసం ఖర్చు పెట్టలేదు. ఒక విధంగా రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి యార్డు నిధులతో అన్నదాతలకు మాత్రం ఏమీ చేయలేదు. దీంతో ఛైర్మన్లు, పాలకవర్గ సభ్యుల పదవులు అలంకార ప్రాయంగానే మిగిలాయి.

తొలిసారిగా రూ.11 లక్షలకు అనుమతి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యార్డు నిధుల్లో రూ.11 లక్షలు ఖర్చు పెట్టేందుకు ఇటీవల అనుమతులు ఇచ్చారు. వాటిలో మరుగుదొడ్లు, రైతు విశ్రాంతి మందిరం, హమాలీలు, అన్నదాతలు కూర్చునే అరుగు మరమ్మతులు చేయబోతున్నాం. యార్డుకు వచ్చే నిధులు కొంత జీతాలకు, 25 శాతం నిధులుగా ప్రభుత్వానికి ఇస్తాం. అవన్నీ పోయినా ప్రస్తుతం రూ.1.8 కోట్లు నిధులు అందుబాటులో ఉన్నాయి.

- ఎన్.శ్రీనివాసరావు, యార్డు కార్యదర్శి

సిరుల తల్లి.. కల్పవల్లి



తాడేపల్లి శివాలయంలో..



మంగళగిరిలో..



దుగ్గిరాలలో...



అద్దంకమ్మ తల్లి ఆలయంలో..



పెదనందిపాడులో..



అమీనాబాద్‌లో..



తాడికొండ: బడేపురంలో..



నృసింహుని ఆలయంలో..



పుల్లడిగుంటలో..



అనంతవరప్పాడులో..



అనంతవరంలో..



ప్రత్తిపాడులో..



పెదనందిపాడులో సామూహికంగా పూజలు నిర్వహిస్తూ..

దేవీ శరన్నవరాత్రులు తాడికొండ, మంగళగిరి, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నారు. భక్తులు విశేష పూజలు చేపడుతున్నారు. పలు ఆలయాల వద్ద ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. **- న్యూస్‌టుడే, బృందం**

పురుగుల నివారణకు చర్యలు



జీవామృతం తయారి విధానాన్ని రైతులకు వివరిస్తున్న అధికారులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : పత్తి పైరుకు ఆశించిన పురుగు నివారణకు రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి సుధారాణి అన్నారు. మంగళవారం మండలంలోని కొప్పర్రు, అన్నపర్రు గ్రామాల్లో పంట పొలాలను ఆమె పరిశీలించి అన్నదాతలకు పలు సూచనలిచ్చారు.

బాలలతో పని చేయించడం నేరం

మంగళగిరి, న్యూస్‌టుడే : బాల కార్మిక నిర్మూలనపై కార్మిక శాఖ ఆధ్వర్యంలో మంగళగిరిలో న్యాయవాదులు అవగాహన కల్పించారు. పట్టణంలోని కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు పాల్గొన్నారు. 14 ఏళ్ల లోపు బాలలతో పని చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. బాల కార్మికులను గుర్తిస్తే 1098కు సమాచారం అందించాలని కోరారు.

సూక్ష్మ ఆర్థిక రుణ బాధితులుగా పేదలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : ప్రత్తిపాడు మండలంలో కూలీ పనులు చేసుకునే పేదలు సూక్ష్మ ఆర్థిక రుణ సంస్థల బాధితులుగా మారుతున్నారు. ఒక వాయిదా చెల్లించకపోయినా మీరు డబ్బులు ఇస్తేనే ఇంటి దగ్గర నుంచి వెళ్తాం...లేదంటే వెళ్లబోమని ఆయా సంస్థల ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. రాత్రి 11 వరకు ఇళ్ల వద్ద ఉండి బలవంతంగా వాయిదాలు వసూలు చేస్తున్నారు. కొందరు ప్రతినిధులు అయితే దురుసుగా ప్రవర్తిస్తున్నారని మహిళా బాధితులు వాపోతున్నారు. ప్రత్తిపాడులో పలు రకాల సంస్థల ప్రతినిధులు కూలీ పనులు చేసుకునే కుటుంబాల ఇళ్లకు వెళ్లి గ్రూపుగా ఉన్న సభ్యులకు రుణాలు ఇస్తామని చెప్పి 5 నుంచి 10 మంది సభ్యులను బృందాలుగా తయారు చేశారు. వారానికి, నెల రోజులకు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అనారోగ్యంతో కూలీ పనుల వెళ్లకపోయినా వాయిదా చెల్లించాలని తీవ్రస్థాయిలో ఒత్తిడి చేసి ఇళ్లవద్ద కాపలా కూర్చోవడంతో అధిక వడ్డీకి అప్పులు చేసి మరి వాయిదాలు చెల్లించాల్సి వస్తోందని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

18 ఏళ్లు నిండితే వైద్య పరీక్షలు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఫిరంగిపురం, నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం వైద్య సిబ్బంది సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎన్‌సీడీ సీడీ ప్రోగ్రాం అధికారులు శ్రావణ్‌బాబు, గిరిధర్ మాట్లాడుతూ ఇంటింటికీ తిరుగుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రక్తపోటు, క్యాన్సర్ తదితర వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. అవసరమైతే బాధితులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి పంపించాలని కోరారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం అమలు తీరు వివరించారు.

పెదనందిపాడు, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరు సత్ ప్రవర్తన పాటిస్తే జీవితాన్ని ఒడిదుడుకులు లేకుండా గడపవచ్చని వైద్య ఆరోగ్యాధికారి లావణ్య అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం సిరి మహిళా సాధికారిక వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. తొలుత హెచ్ఐవీ నివారణ మార్గాలను పత్రాల ద్వారా వివరించారు. ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు: చోరీ సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సొత్తుతో ఎస్సై వెంకట్, సిబ్బంది

మంగళగిరి, న్యూస్‌టుడే : మంగళగిరి గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలో మండలంలోని నవులూరుకు చెందిన నిందితుడు మహ్మద్ సుహేల్ అహ్మద్‌ను ఎస్సై వెంకట్ మంగళవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, ఏసీ, వాటిని అపహరించేందుకు వినియోగించిన యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విలేకరులకు తెలిపారు. చినకాకాని పరిధి హాయ్‌ల్యాండ్ రోడ్డులో గత నెల 29న వేగంటి, జూపిటర్, క్రిష్టల్ అపార్టుమెంట్‌లలో నిందితుడు చోరీకి పాల్పడినట్లు ఆయన చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎనిమిది నెలల బిడ్డతో వివాహిత అదృశ్యం

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే : ఎనిమిది నెలల బిడ్డతో వివాహిత అదృశ్యంపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని కొర్నెపాడుకు చెందిన అన్నవరపు నీలిమ ఈ నెల 7న కాకానితోటకు వెళ్లి వస్తానని చెప్పి ఎనిమిది నెలల బిడ్డతో ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడం, ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడంతో ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నించారు. ఆమె తల్లి గేరా కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

మరో ఘటనలో బాలిక....

తుళ్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలిక(17) పదో తరగతి వరకు చదివి ఖాళీగా ఇంట్లో ఉంటుంది. రాత్రి అందరితో కలసి నిద్రించిన బాలిక ఈ నెల 7న కుటుంబ సభ్యులు ఉదయం లేచి చూసే సరికి అదృశ్యమైంది. గ్రామంలోనూ చుట్టుపక్కల వెతికినా కనిపించక పోవడంతో బాలిక తల్లి తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తుళ్లూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

తెనాలి

పట్టుకుంటే అంతే..



పట్టణ పరిధి జీబీసీ రహదారిలో డివైడర్ల మధ్య ఉన్న విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. తీగలు బయటకు వేళాడుతున్నాయి. తీగలకు టేపు చుట్టి ఉన్నా ప్రమాదం పొంచి ఉంది. గతంలో బాపట్ల రోడ్డులో విద్యుత్తు తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకముందే అధికారులు మేల్కొని తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, పొన్నూరు

పొంచి ఉన్న ప్రమాదం..

హనుమాన్‌పాలెం వయా నందివెలుగు రెండు వరుసల రహదారిలో గుంతలు వాహన చోదకులకు ప్రమాద భరితంగా మారాయి. దావులూరు అడ్డరోడ్డుకు చేరువలో చివలూరు గ్రామాల నడుమ రహదారికి పడిన గుంతలో రాత్రివేళ వాహన చోదకులను గాయాలపాలు చేస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, కొల్లిపర



మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణంలోని కొత్తపేటలో అపరిశుభ్రత తాండవిస్తోంది. పందుల గుంపుల సంచారం అధికంగా ఉంది. ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో చెత్త డంపింగ్ పాయింట్ వద్ద మున్సిపాలిటీ వారితో పాటు ఇతరులూ చెత్త తెచ్చి పోస్తున్నారు.
- నాగరాజు, సత్యం, స్థానికులు

✔ డంపింగ్ పాయింట్ వద్ద వ్యర్థాలను సత్వరం తొలగింపచేస్తాం. ఇతర సమస్యలపై స్థానిక సిబ్బందితో మాట్లాడతాను.

? 38వ వార్డులో మురుగు కాలువల పూడికల తొలగింపునకంటూ రాళ్లు తొలగించి తిరిగి ఏర్పాటు చేయలేదు. **- స్థానికులు**

✔ సమస్యను పరిష్కరిస్తాం. **(పై ప్రశ్నలకు పురపాలక కమిషనర్ బి.శేషన్న సమాధానాలు ఇచ్చారు)**
– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? డీవీసీ కాలనీలో వీధి దీపం వెలగడం లేదు. రాత్రి సమయంలో రాకపోకలు నిర్వహించాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది. **-రవిబాబు**

✔ వీధి దీపం బాగు చేయించే విధంగా చూస్తా. **-అపర్ణ, సహాయ ఇంజినీర్**

? పట్టణ పరిధి విద్యానగర్‌ని మురుగు కాలువలో వ్యర్థాలను తొలగించకపోడంతో దుర్వాసన వస్తుంది. **-శ్యామ్‌బాబు**

✔ మురుగు కాలువను శుభ్ర పరిచే విధంగా తగు చర్యలు తీసుకుంటా. **- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి**
–న్యూస్‌టుడే,పొన్నూరు

చెత్త తొలగింపు

స్పందనకు వందనం

మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. క్యాబిన్‌పేటలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. – న్యూస్‌టుడే,పొన్నూరు

గత వైకాపా నిర్వాకం..
గ్రామీణ ఇళ్ల లబ్ధిదారులకు నష్టం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టణాల్లోని ప్రభుత్వ లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు లభించిన గ్రామీణ లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద అందించనున్న ప్రయోజనాలు దక్కక నష్టపోనున్నారు. గత ప్రభుత్వం చేసిన ఈ పని వల్ల నష్టపోకుండా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని పేదలు కోరుతున్నారు.

గతంలో పంపిణీ ఇలా..

గత వైకాపా హయంలో సొంత ఇళ్లు లేని పట్టణ పేదలకు తెనాలి మండలం పెదరావూరు, జగ్గడిగుంటపాలెం, నేలపాడు, గోలిడొంక, బుర్రిపాలెంలో భూ సేకరణ జరిపి ఒక్కొక్కరికి సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. వీరికి కేంద్ర ప్రభుత్వ పట్టణ గృహ నిర్మాణ పథకం కింద మంజూరు చేసే రూ.1.50 లక్షల సాయాన్ని గ్రామీణ లబ్ధిదారులకు వర్తింప చేసేందుకుగాను అదే లేఅవుట్లలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. ఇలా చేయడం వల్ల వీరికి ఇంటికి అదనంగా రూ.30 వేలు సాయం లభిస్తుంది. కానీ వారికి గ్రామాల్లో దక్కాలిసిన 1.5 సెంటుకు బదులు 1 సెంటు పొందారు. ఇప్పటికే జరిగిన అన్యాయం వల్ల మరో అర సెంటు కోల్పోయారు. ఈ లేఓట్లు వేసింది గ్రామాల్లోని రైతుల నుంచి సేకరించిన భూముల్లోనే. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి దక్కాలిసిన ప్రయోజనాలు కల్పించాలని కోరుతున్నారు.



గ్రామీణ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన పెదరావూరు లేఔట్

వచ్చే ఏడాది మార్చికి ముగుస్తుంది..

ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పట్టణ గృహ నిర్మాణ పథకం కింద అందించే ఆర్థిక సాయం వచ్చే ఏడాది మార్చితో నిలిచిపోనుంది. ఈలోపు గృహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా పాలనాధికారి నాగలక్ష్మి ఇప్పటికే పలుమార్లు లబ్ధిదారులకు సూచించారు. గ్రామాల్లో సొంత ఇళ్లు లేని వారిలో ఎక్కువ మందిని కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ పథకానికి ఎంపిక చేశారు. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రానున్న ఈ పథకం కింద మంజూరు కానున్న ఆర్థిక సాయం పొందే లబ్ధిదారుల ఎంపిక అధికారులకు పరీక్ష కానుంది.

☛ తెనాలి మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్ల పట్టాలు ఇచ్చిన లేఅవుట్లలో పెదరావూరులో 250 మందికి, జగ్గడిగుంటపాలెంలో 800 మందికి, నేలపాడులో 1,020 మంది గ్రామాల్లోని లబ్ధిదారులకూ పట్టాలు మంజూరు చేశారు.

సర్వే నిర్వహించాలి

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మూడు దశాబ్దాల కిందట నిర్వహించిన సర్వేలో కేంద్ర గ్రామీణ గృహ నిర్మాణ పథకానికి అర్హుల పేర్లు నమోదు చేశారు. వీరికి ఆ పథకం ప్రయోజనాలు లభించాయి. కాలక్రమంలో ఆ సర్వేలో నమోదు కాని వారికి పట్టణ లేఔట్లలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. వీరికి పట్టణ గృహ నిర్మాణ పథకం ప్రయోజనాలు కల్పించారు. రానున్న గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద గ్రామాల్లోని లబ్ధిదారుల ఎంపిక కోసం మరోసారి సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాల్సి ఉందని తెనాలి డివిజన్ గృహ నిర్మాణ సంస్థ అధికారులు 'న్యూస్‌టుడే' తెలిపారు.

పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన

చేబ్రోలు, న్యూస్‌టుడే: గ్రామ ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు గ్రామాల్లో జరిగే పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఎంపీడీవో లలిత, డీపీఆర్‌సీ జిల్లా సమన్వయ కర్త పద్మారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిని కలిసిన కమిషనర్

పొన్నూరు, న్యూస్‌టుడే: ఇటీవల డ్వామా పీడీగా, పొన్నూరు పురపాలక సంఘం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వి.శంకర్‌ను మంగళవారం గుంటూరులోని డ్వామా కార్యాలయంలో పురపాలక సంఘ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, డీఈ ఏడుకొండలు మార్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

తోపుడు బండి అందజేత

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: హెల్పింగ్ సోల్జర్స్ ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన దివ్యాంగ దంపతులు నాగార్జున, శ్రీలతలకు జీవనోపాధి నిమిత్తం మంగళవారం తెనాలి మారీసుపేటలో తోపుడు బండిని అందించారు. జాస్తి హాసిని, నందిని సౌజన్యంతో బండిని ఏర్పాటు చేసినట్లు సంస్థ అధ్యక్షుడు షేక్.ఇనాయతుల్లా తెలిపారు.

ఘనంగా పాస్టర్ల దినోత్సవం

తెనాలి టౌన్: పట్టణ మారీసుపేటలోని రాక్ గాస్పెల్ చర్చి ఆవరణలో మంగళవారం ప్రపంచ పాస్టర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బిషప్ జాన్‌పాల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు బ్రదర్ ఆనందన్న, రెవరెండ్ పల్లె శామ్యూల్, రెవరెండ్ చిట్టిబాబు, పాస్టర్ దానియేలురాజు తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ సుబ్బారావుకు ఆత్మీయ వీడ్కోలు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: సాధారణ బదిలీల్లో భాగంగా పురపాలిక పట్టణ ప్రణాళికా విభాగ అసిస్టెంటు సిటీ ప్లానర్ సుబ్బారావు మంగళవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆ విభాగ ఉద్యోగులు, సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

ఘనంగా వేదమహాసభ

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం విద్యాశంకర భారతి నృసింహ సదనంలో వేద మహాసభ ఘనంగా నిర్వహించారు. సమాఖ్య కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేద పండితులు వేదం విశిష్టతను విశదీకరించారు. కార్యక్రమంలో విష్ణుభట్ల ఆంజనేయ చైనులు, శ్రీ కృష్ణ, సత్యనారాయణ, లక్ష్మీపతి, వేదపండితులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతోనే భూసారం

చేబ్రోలు, న్యూస్‌టుడే: పచ్చిరొట్ట ఎరువులతోనే భూసారం పెరుగుతుందని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మండలంలోని గుండవరం, గొడవర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఆయన మాట్లాడారు. గొడవర్రు సర్పంచి జానకీ దేవి, ఏవో శ్రీనివాసానాయక్ పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ దాడులపై నిరసన

పెదకాకాని, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను అరికట్టేలా ప్రపంచ దేశాలు ముందుకు రావాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. పెదకాకాని సుందరయ్యకాలనీలో మంగళవారం పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా సీపీఎం నాయకులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాయకులు సాంబయ్య, చెన్నం రామకృష్ణ, నాగేశ్వరరావు, శివలింగం, సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి డిపోలో కొత్త బస్సుల సందడి

న్యూస్‌టుడే, తెనాలి టౌన్

జిల్లాలో గుంటూరు తరవాత అంతటి ప్రాధాన్యం, ఆదాయం ఉన్న తెనాలి ఆర్టీసీ సమస్యలు క్రమంగా పరిష్కారం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత స్థానిక శాసనసభ్యుడు, మంత్రి నాదెండ్ల మనోహర్ ఆర్టీసీపై దృష్టి పెట్టడంతో పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఎప్పటి నుంచో గుంతలు, గోతులతో దుర్భరంగా ఉన్న ఆర్టీసీ ఆవరణ బాగు చేత పనులు మొదలై కొంత మేర పూర్తి అయ్యాయి. వాన వచ్చిన ప్రతిసారి ఆవరణలో భారీగా నీరు చేరి రోజుల తరబడి నిలిచి ఉండి చెరువును తలపించే పరిస్థితి కూడా ఇప్పుడు మారింది. 5 హెచ్‌పీ మోటారును కొత్తగా ఏర్పాటు చేయటంతో ఆవరణలో చేరిన నీరు అతి తక్కువ సమయంలోనే వెలుపలికి వెళ్లిపోతుంది. ఈ ఒరవడిలోనే కొత్త బస్సులు వస్తున్నాయి. వాస్తవానికి డిపోకు నూతన బస్సుల అవసరం ఉందని గత వైకాపా పాలనలోనూ తెనాలి డిపో నుంచి ప్రతిపాదనలు వెళ్లినా అవి సాకారం కాలేదు. ఇప్పుడు నూతన బస్సుల రాకతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించే ప్రయత్నం జరుగుతుంది. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, గుంటూరు వంటి నగరాలతో పాటు 142 గ్రామాలకు రోజూ తెనాలి ఆర్టీసీ డిపో నుంచి బస్సులు సేవలందిస్తాయి. తెనాలి ఆర్టీసీ డిపో ప్రాధాన్యతను ఈ గణాంకాలు చెప్పేస్తాయి.

మొత్తం బస్సులు	87 (ఆర్టీసీ 65, అద్దె బస్సులు 22)
రోజూ ప్రయాణికులు	30 వేల నుంచి 35 వేల మంది
రోజూ ఆదాయం	రూ.12.5లక్షల నుంచి రూ.14 లక్షలు
మొత్తం సిబ్బంది	500 (వీరిలో 100 మంది ఒప్పంద ఉద్యోగులు)



ప్రారంభించనున్న కొత్త బస్సులు ఇవే

✦ కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత డిపోకు తొలిగా 6 కొత్త బస్సులు రాగా మంత్రి మనోహర్ జులై 8న వాటిని ప్రారంభించారు. ఇప్పుడు మరో ఆరు బస్సులు వచ్చాయి. వాటిని ఆయన బుధవారం ప్రారంభించనున్నారు. రెండు నెలల వ్యవధిలో మరో 5 కొత్త బస్సులు తెనాలి డిపోకు రానున్నట్లు అధికారులు తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



తెనాలి ఆర్టీసీ డిపో ఎదుర్కొంటున్న సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయి. మంత్రి మనోహర్ చొరవ తీసుకోవటం వల్ల ఎప్పటి నుంచో నిలిచి ఉన్న, డిపోకు అవసరం అయిన పనులు మొదలై సాగుతున్నాయి. ప్రయాణికుల అవసరాల రీత్యా తెనాలి డిపోకు కొత్త బస్సుల అవసరం చాలా ఉంది. ఆ సమస్య కూడా ఇప్పుడు పరిష్కారం అయింది. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించటానికి అవసరం అయిన చర్యలు తీసుకుంటాం.
– ఏ.రాజశేఖర్, తెనాలి డిపో మేనేజర్

జగన్మాత ఉత్సవం.. అంతటా ఆనందం



గంగానమ్మపేట: రూ. 6 లక్షలతో ధనలక్ష్మి అలంకారం



బోసురోడ్డు: వాసవీ ఆలయంలో..



వాసవీ మాత ప్రాంగణంలో..



రామస్వామిపేట రూ.10లక్షల నోట్లతో..



రామలింగేశ్వరపేట దుర్గాపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో



పొన్నూరు: కుంకుమపూజలో మహిళలు

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఆరో రోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో కొలువైన దేవీ ఆలయాలు భక్తులతో శోభిల్లాయి. వారాహీదేవి, పత్యంగిరాదేవి, ధనలక్ష్మి అలంకారాలలో ముక్తి ప్రదాయని దర్శనమిచ్చారు. అమ్మను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు పంచారు.
–న్యూస్‌టుడే, బృందం



విజ్ఞాన్‌లో పూజలు చేస్తున్న లావు నిర్మల



కొల్లిపర ముక్తేశ్వరస్వామివారి ఆలయంలో లక్ష్మీదేవిగా



పొన్నూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



పొన్నూరు: మహాలక్ష్మీదేవిగా..



పెదకాకానిలో మహాలక్ష్మి దేవిగా..

తెనాలిలో ఆబ్కారీ దుకాణాలకు 143 దరఖాస్తులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం సెబ్ స్టేషన్ల విధానాన్ని రద్దు చేసి గతంలో ఉన్నట్లుగా ఆయా స్టేషన్లను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లుగా మార్చిన క్రమంలో తెనాలి సర్కిల్ స్టేషన్ బోర్డులను మార్చారు. నూతన విధానం మేరకు తెనాలి స్టేషన్ పరిధిలోని అంశాలను ఎక్సైజ్ సీఐ వెంకటాచలం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. తెనాలి స్టేషన్ పరిధిలో పట్టణం, మండలం, కొల్లిపర, దుగ్గిరాల మండలాలు ఉన్నాయి. తెనాలి పట్టణంలో 11, మండలంలో 5, కొల్లిపరలో 4, దుగ్గిరాల్లో 5 వెరసి మొత్తం 25 ప్రైవేటు మద్యం దుకాణాలకు ఈ నెల 1 నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. ఈ నెల 8వ తేది వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కలిపి మొత్తం 143 దరఖాస్తులు వచ్చాయి. బుధవారంతో గడువు ముగియనుందన్నారు.

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు డివిజన్ పరిధిలోని మద్యం దుకాణాలు కోసం 160 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సిఐ మేడికొండ రమేషు బాబు మంగళవారం రాత్రి వెల్లడించారు. పట్టణ పరిధిలోని 4 దుకాణాలకు 52, పొన్నూరు మండలంలోని 3 దుకాణాలకు 13, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని కాకుమాను మండలంలోని 2 దుకాణాలకు 19, పెదనందిపాడు మండలంలోని 3 దుకాణాలకు 76 దరఖాస్తులు స్వీకరించామని ఆయన పేర్కొన్నారు.

'పాలన పక్కన పెట్టి కార్యకర్తలను వేధిస్తున్నారు'

గోరంట్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టకుండా కేవలం వైకాపా నాయకులు, కార్యకర్తలను వేధిస్తూ కాలయాపన చేస్తుందని వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వైకాపా జిల్లా కార్యాలయంలో తెనాలి నియోజకవర్గ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లా పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను అందరం కలిసి ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, తెనాలి జడ్పీటీసీ పి.ఉమాప్రణతి నాయకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో తల్లిపై కుమారుడి దాడి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక బస్టాండ్ సమీపంలో ఒక యువకుడు మద్యం మత్తులో పడి ఉంటే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి అతను నందుల పేటకు చెందిన ఈశ్వరప్రసాద్‌గా గుర్తించి తల్లి కొల్లిపర హైమావతికి సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి కుమారుడిని ఆటోలో ఇంటికి తీసుకెళ్లారు. అతను నిద్ర నుంచి లేచిన తర్వాత తల్లిపై ఇటుక రాయితో దాడి చేసి వెళ్లిపోయాడు. తలకు గాయమైన హైమావతి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. తన కుమారుడు బీటెక్ చదువుతూ మధ్యలో ఆపేశాడని, మానసిక స్థితి సరిగ్గా లేదని ఆమె పోలీసులకు తెలిపారు.

13న పోస్టల్ పరుగు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 13న గుంటూరులో ఇండియా పోస్టు రన్ పేరిట మారథాన్ నిర్వహిస్తున్నట్లు తెనాలి పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ కరుణాకర్‌బాబు మంగళవారం తెలిపారు. కార్యక్రమ స్పాన్సర్లలో ఒకరైన తెనాలి డబుల్ హార్స్ అధినేత మునగాల మోహన్‌శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి పతకాలను విడుదల చేశారు. తెనాలి మండలం నందివెలుగులో డబుల్ హార్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శేఖర్, సుధీర్‌బాబు, యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.

యోబు సేవలు మరువలేం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అభివృద్ధిలో ఏసీఈ యోబు సేవలు మరువలేమని ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ చెప్పారు. యోబు మృతిపై ఏఎన్‌యూలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. యోబు చిత్రపటానికి వీసీ ఆచార్య గంగాధర్, రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ఘనంగా నివాళులర్పించారు. ఓఎస్‌డీ ఆచార్య రవికుమార్, ప్రవేశాల విభాగం సంచాలకులు డాక్టర్ బ్రహ్మాజీ, వికాస ప్రధాన కార్యదర్శి కావూరి సాంబశివరావు, ఆనంద్, కోటేశ్వరరావు తదితరులు యోబు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

సందేశాత్మకం.. నాటకోత్సవం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కళలకాణాచి, వేదగంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక నాటిక పోటీల ప్రదర్శన రెండో రోజు మంగళవారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన హైదరాబాద్ శ్రీకళానికేతన్ వారి సంజవెలుగు సాంఘిక పద్యనాటకం, ఉక్కునగరం చైతన్య కళాస్రవంతి వారి మంత్రనగరి సాంఘిక నాటకం, గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి చిగురు మేఘం, వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు వారి నిశి సాంఘిక నాటికలు చక్కని సందేశాన్ని చాటి చెప్పాయి. ఈ సందర్భంగా సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ నాటకాల, నాటికలలోని నటీనటులను జ్ఞాపికలు బహూకరించి అభినందించారు. కార్యక్రమంలో బుర్రా జయలక్ష్మి, చెరుకుమల్లి సింగారావు, అయినాల మల్లేశ్వరరావు, గోపరాజు విజయ్, దేవరపల్లి భవాని పాల్గొన్నారు.



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న సాయిమాధవ్ తదితరులు

కార్పొరేషన్ల డైరెక్టర్లకు అభినందనలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: బాధ్యతల స్వీకరించిన సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ కేనన కోటేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్‌లను తెదేపా నాయకులు మంగళవారం అభినందించారు. తెదేపా వాణిజ్య విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో వారిద్దరిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేసన శంకరరావు, కన్నెగంటి మురళీకృష్ణ, దివి అనిత, తాడిబోయిన హరిప్రసాద్, డాక్టర్ శేషగిరిరావు, మహేష్, రాము, రవీంద్ర, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు తూర్పు

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: పౌరసరఫరాల కార్మికులకు కూలీరేట్లు పెంచాలని ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ (ముఠా) కార్మికుల సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌ను గుంటూరులోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. కార్మికులకు దసరా బోనస్, యూనిఫాం తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్పందించిన మేనేజర్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కమిషనర్ భువనేశ్వర్ పర్యటన

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: స్టడీటూర్‌లో భాగంగా జీఎంసీ కమిషనర్ పి.శ్రీనివాసులు మంగళవారం ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ నగరపాలకసంస్థ కార్యాలయంలో పర్యటించారు. అక్కడి కమిషనర్ రాజేష్ ప్రభాకర్, అధికారుల బృందాన్ని కలిసి పౌరసేవలు, ఆస్తి పన్ను, తాగునీటి సరఫరా, మన వ్యర్థాల నిర్వహణ అంశాలపై అనుసరిస్తున్న విధానాలు తెలుసుకున్నారు. కమాండ్ కంట్రోల్ రూం, వాటర్ ఫిల్టరేషన్ పాయింట్స్, సరఫరా విధానం పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

? పాతగుంటూరు రంగాబొమ్మ సెంటర్‌లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. కుక్కలు గుంపులుగా వీధుల్లో సంచరిస్తూ రోడ్లపై వెళ్లేవారిని కరుస్తున్నాయి. -శివ, పార్కు సెంటర్

✔ వీధి కుక్కల్ని కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. **- సునీల్, ఏఈ, నగరపాలకసంస్థ**

? జెండాచెట్టు సెంటర్ నుంచి శ్మశానాలకు వెళ్లే దారిలో ఆటోలు నిలుపుదల చేస్తున్నారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **-సత్యనారాయణ, బస్టాండు సెంటర్**

✔ ఆటోలు రోడ్లపై నిలుపుదల చేయకుండా తగిన చర్యలు చేపడతాం. **- అశోక్‌కుమార్, సీఐ, తూర్పు విభాగపు ట్రాఫిక్**

? సుద్దపల్లిడొంకరోడ్డులో లో-ఓల్టేజీ సమస్య అధికంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చర్యలు తీసుకోవాలి. - నాగేశ్వరరావు, యాదవబజారు

✔ సమస్యను ఉన్నతాధికారులకు వివరించి పరిష్కరిస్తాం- మస్తాన్- విద్యుత్‌శాఖ ఏ.ఈ **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

స్పందనకు వందనం

★ రాజాగారితోట సంక్షేమ వసతిగృహం ఎదుట రోడ్డులో సైడుకాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారుదలకావడంలేదు. దుర్గంధంతోపాటు దోమలు వస్తున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్య శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సిబ్బందిని పంపి కాల్వలో పూడిక తీయించారు.

★ వాసవినగర్ ప్రధానరోడ్డులో చెత్తకుప్పలు రోజులపాటు పేరుపోతున్నా తొలగించడంలేదు. దీనిపై 'మేమున్నాం మీకు తోడుగా'కు తెలపగా సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చెత్త కుప్పలు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

– న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ (గుంటూరు)

రహదారుల ఆక్రమణలు.. రాకపోకలకు అవస్థలు


ఆర్.అగ్రహారంలో రోడ్డుపై నిల్వ చేసిన మొద్దులు


కొత్తపేటలోని ఓ వీధిలో కాలువ ఆక్రమించి వేసిన బంకులు


బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్ ఎదుట రోడ్డుపై పార్కింగ్ చేసిన కార్లు

నగరపాలక సంస్థ పరిధిలో ఆక్రమణలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. గత ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు చేసినా రాజకీయ ఒత్తిడితో అధికారులు మిన్నకుండిపోయారు. నగరపాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఉదాసీనంగానే వ్యవహరిస్తున్నారు. దీంతో నగరవాసులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లు ఆక్రమించి వ్యాపారులు తమ సామగ్రి నిల్వ చేస్తున్నా నియంత్రించే నాథుడే లేడు. ఆర్ అగ్రహారం, నగరంపాలెం పరిధిలోని టింబర్ డిపోల యజమానులు, వ్యాపారులు సిమెంట్ రోడ్లు ఆక్రమించి కట్టెలు నిల్వ చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారి మార్జిన్‌లో అద్దె కార్లు నిలుపుతున్నారు. గతంలో ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ కార్లు పార్కింగ్ చేయరాదని డ్రైవర్లకు సూచించినా మళ్లీ ఇక్కడే ఉంచుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పేట, పాతగుంటూరు, సంగడిగుంట, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో మురుగు కాల్వలు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేశారు. అసలే ఇరుకు రోడ్లు కావడంతో ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

- గుంటూరు నగరం, న్యూస్‌టుడే

సైబర్ నేరాలపై అప్రమత్తం


మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. పాత గుంటూరులోని యాదవ హైస్కూల్‌లో మంగళవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వారి సమాచారం పోలీసులకు ఇవ్వాలని తెలిపారు. చదువుకునే యువకులపై కేసులు నమోదైతే వారి భవిష్యత్తు పాడయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. అనుమతి లేకుండా డీజేలను వినియోగిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. తూర్పు విభాగపు డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు సీఐ సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్లోకి నూతన ఉత్పాదనలు విడుదల


నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ ఉత్పాదనలు మార్కెట్లోకి విడుదల చేస్తున్న నిర్వాహకులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలు, అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించిన నూతన ఉత్పాదనలు గ్లాంజ్, బోస్‌నెట్ శిలీంద్రనాశినులు (తెగుళ్ల మందు), నాట్‌నెక్స్ కీటకనాశిని (పురుగుల మందు)ను మంగళవారం మార్కెట్లోకి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు రాజేష్ చెబియం, సేల్స్, మార్కెటింగ్ హెడ్ ఇండియా సార నర్సయ్య, సౌత్ సేల్స్ జడ్‌ఎం రామిశెట్టి మాలకొండయ్య, ఏపీ సేల్స్ మార్కెటింగ్ అజయ్ రెడ్డి పాల్గొన్నారు. రాజేష్ చెబియం, సార నర్సయ్య మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు గ్లాంజ్ సమర్థంగా పని చేస్తుందన్నారు. బోస్‌నెట్ మచ్చల తెగుళ్లను నివారిస్తుందని, నాట్‌నెక్స్ కాయ తొలుచు పురుగు, నల్లి నివారణకు పని చేస్తుందని వివరించారు.

మద్యం దుకాణాలకు 3,500 దరఖాస్తులు


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జోన్ పరిధిలోని మద్యం దుకాణాలకు మంగళవారం నాటికి 3,500 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం వరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 256 మద్యం దుకాణాలకు 1,700 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం గుంటూరు జిల్లాలోని దుకాణాలకు 1,200కు పైగా, పల్నాడు జిల్లాలోని దుకాణాలకు 600కుపైగా దరఖాస్తులు దాఖలయ్యాయి. ఎక్సైజ్ పోలీసుస్టేషన్లలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జోన్ డీసీ శ్రీనివాసులు, ఏసీ రవికుమార్‌రెడ్డి, ఈఎస్ అరుణకుమారి మంగళవారం సాయంత్రం వరకూ దరఖాస్తుల స్వీకరణ పర్యవేక్షించారు.

రాజధాని ప్రాంతంలో పోటీ...

రెండు జిల్లాల్లో అత్యధికంగా వ్యాపారులు గుంటూరు జిల్లాలో దరఖాస్తులు దాఖలు చేస్తున్నారు. జిల్లాలో 127 దుకాణాలకు మొత్తం 2,330 దరఖాస్తులు వచ్చాయి. వ్యాపారులు అధికంగా రాజధాని అమరావతి ప్రాంతంలోని మద్యం దుకాణాలకు పోటీ పడుతున్నారు. జిల్లాలో అత్యధికంగా తుళ్లూరు మండలంలోని ఓ దుకాణానికి 62 మంది, అదే మండలంలోని మరో మూడు దుకాణాలకు 60 వరకు దరఖాస్తులు వచ్చాయి. తాడికొండ మండలంలోని ఓ దుకాణానికి 40, పెదకాకాని మండలంలోని నాలుగు దుకాణాలకు 30 వరకు దరఖాస్తులు వచ్చాయి. గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలోని సుమారు 10 ప్రాంతాల్లోని ఒక్కో దుకాణానికి 30 వరకు దరఖాస్తులు దాఖలయ్యాయి.

సిబ్బందికి విధుల కేటాయింపు

నగరపాలకసంస్థ: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో వార్డుల వారీగా పని సర్దుబాటు కింద అధికారులు, సిబ్బందికి విధులు కేటాయిస్తూ కమిషనర్ పి.శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల బదిలీల్లో భాగంగా పలువురు అధికారులు జీఎంసీకి వచ్చారు. నగరంలోని నాలుగు జోన్‌లు ఎన్నికల డివిజన్ల వారీగా అధికారులకు విధులు కేటాయించారు. రీసర్వేకు డీసీపీ సూరజ్‌కుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు, ప్రకటన బోర్డుల అనుమతి, ఫీజుల వసూలు ఏసీపీ ఎస్.ఫజులార్ రెహ్మాన్‌కు బాధ్యతలు అప్పగించారు. సర్వేయర్లు షేక్ మహబూబ్ సుభాని తూర్పు నియోజకవర్గం, ఏటుకూరు, బుడంపాడు, పొత్తూరు, చౌడవరం, గోరంట్ల, అమరావతిరోడ్డు తూర్పు వైపు, రెడ్డిపాలెం కేటాయించగా, బి.లక్ష్మీనారాయణకు గుంటూరు పశ్చిమం, అంకిరెడ్డిపాలెం, నల్లపాడు, పెదపలకలూరు, అడవితక్కెళ్లపాడు, గోరంట్ల, అమరావతిరోడ్డు పశ్చిమం వైపు ప్రాంతాలు కేటాయించారు.

ఎస్ఆర్ శంకరన్ అడుగుజాడల్లో నడవాలి


మాట్లాడుతున్న పీవీ రమేష్, వేదికపై లక్ష్మణరెడ్డి, డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నిజాయతీగా పేదల అభ్యున్నతి కోసం కృషి చేసి ప్రజల అధికారిగా మన్ననలు పొందిన ఎస్.ఆర్.శంకరన్ అడుగుజాడల్లో ప్రభుత్వ యంత్రాంగం నడవాలని విశ్రాంత స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్ అన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో సోమవారం రాత్రి ఎస్ ఆర్ శంకరన్ 14వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభలో పీవీ రమేష్ మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ జీవితం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు అందించిన అసైన్డ్ భూములను అమ్ముకోరాదని, వారి వారసులు అనుభవించుకునే హక్కు మాత్రమే ఉండాలని శంకరన్ హక్కు కల్పించి వారికి భద్రత అందిస్తే గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం అసైన్డ్ భూములను అమ్ముకునే విధంగా చట్టం చేయటం దుర్మార్గమన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ జీవించినంత కాలం బడుగువర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ శంకరన్ చేసిన సేవలను గుర్తించి నూతన ప్రభుత్వ పథకానికి, రాజధానిలో నిర్మించే నూతన ప్రభుత్వ భవనంకు ఆయన పేరు పెట్టాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్, రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు కొల్లా రాజమోవన్‌రెడ్డి, విద్యావేత్త కన్నా మాస్టర్, మానవత ఛైర్మన్ పావులూరి రమేష్, జన విజ్ఞాన వేదిక నాయకులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విధుల్లో అలసత్వం వహిస్తే.. సహించేది లేదు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రిలో విధుల పట్ల అలసత్వంగా ఉంటే సహించేది లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ హెచ్చరించారు. ఆసుపత్రిలో నాట్కో క్యాన్సర్ సెంటర్ నూతన భవనం నిర్మించడం కోసం శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూలుస్తున్న సమయంలో శిథిలాలు మీద పడి ఒక వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉంటే నాలుగు గంటలైనా సరైన వైద్యం అందించకపోవడంపై ఎమ్మెల్యే నసీర్ ప్రభుత్వాసుపత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చికిత్స పొందుతున్న బాధితుడ్ని ఆయన మంగళవారం పరామర్శించారు. భవనం కూల్చే సమయంలో సరైన జాగ్రత్తలు ఎందుకు పాటించలేదని కాంట్రాక్టర్‌పై ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ బాధ్యతారాహిత్యంగా ఉంటే.. మీరెందుకు పట్టించుకోలేదని సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందిన వారిని స్వగ్రామం తీసుకువెళ్లేందుకు ఉపయోగించే మహా ప్రస్థానం వాహనాలను మెయింటెన్ చేసే రిజిస్టర్ అసంపూర్తిగా ఉండడంతో సక్రమంగా పని చేయాలని సంబంధిత అధికారుల్ని మందలించారు.

మహాలక్ష్మీ.. నమోస్తుతే


పొన్నూరురోడ్డు: మహాలక్ష్మీదేవి అలంకరణ


పార్కు సెంటర్‌లో...


బాలాజీనగర్‌లో కాళికాదేవిగా...


ఏటుకూరురోడ్డు: శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


గంటలమ్మ చెట్టువీధి: కాళికాదేవి అలంకరణ..


ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సంతానలక్ష్మిగా..


శివాలయంలో గజలక్ష్మీదేవి


పరమయ్యకుంటలో మహాలక్ష్మీదేవిగా..


భావనారుషి ఆలయంలో..


బుచ్చయ్యతోటలో కుంకుమపూజలు

పట్నంబజారు, నెహ్రూనగర్, న్యూస్‌టుడే, న్యూస్‌టుడే: నగరంలోని పలు ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం కనుల పండువగా జరిగాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


తమ్మారంగారెడ్డినగర్‌లో...


న్యూ గుంటూరు వద్ద ..


ఎన్టీఆర్‌నగర్‌లో..


సోమువారివీధిలో..


బోసుబొమ్మ వద్ద..


లాలాపేటలో సంతానలక్ష్మిగా..


సీతానగర్‌లో కుంకుమపూజలు

రైస్ మిల్లుల ఆకస్మిక తనిఖీ

పట్నంబజారు, న్యూస్‌టుడే: నగరంలోని పలు రైస్ మిల్లుల్లో మంగళవారం తూనికలు, కొలతలశాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులు, సివిల్ సప్లయర్స్ కార్పొరేషన్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు మేరకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయించే రేషన్ బియ్యాన్ని కట్టడి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం కాకాని రోడ్డు, ఏటుకూరురోడ్డు, కోబాల్డ్ పేట, అమరావతి రోడ్డు ప్రాంతాల్లోని మొత్తం 10 రైస్ మిల్లుల్ని తనిఖీలు చేశారు. తనిఖీల్లో తూనికలు, కొలతలశాఖ హెడ్‌క్వార్టర్ జాయింట్ కంట్రోలర్ రాంకుమార్, జాయింట్ కంట్రోలర్ యంఎన్ఎస్ మాధురి, డిప్యూటీ కంట్రోలర్ శ్యాలేమ్‌రాజు, బాపట్ల డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

అజంతా షూ కంపెనీ ప్రారంభం


షూ కంపెనీ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిరిధర్, కంపెనీ ఛైర్మన్ డాక్టర్ కేవీ చలపతి తదితరులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: అరండల్‌పేట 4వలైన్‌లో అజంతా షూ కంపెనీని మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, కంపెనీ ఛైర్మన్ డాక్టర్ కె.వి.చలపతితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ పది మందికి పని కల్పించాలన్న ఉద్దేశంతో కేవీ చలపతి పరిశ్రమ స్థాపించారన్నారు. కంపెనీ ఛైర్మన్ డాక్టర్ కె.వి.చలపతి మాట్లాడుతూ యూరప్ ప్రజలకే కాకుండా, ఇక్కడి ప్రజలకు కూడా యూరప్ స్టాండర్డ్ కలిగిన నాణ్యమైన పాదరక్షలను అందుబాటు ధరల్లో అందించాలన్న సంకల్పంతో నాలుగో కంపెనీ గుంటూరులో ప్రారంభించామన్నారు. త్వరలో అన్ని పట్టణాల్లో ఈ కంపెనీని ప్రారంభిస్తామన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన


బస్టాండ్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన మైక్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ట్రాఫిక్ పోలీసులు బస్టాండ్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఇటీవల ఎస్పీ సతీష్‌కుమార్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, తూర్పు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ఆయా ప్రాంతాల్లో పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా సీఐ అశోక్‌కుమార్ సిబ్బందితో పెట్రోలింగ్ పెంచారు. అయినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు ఆ రహదారికి ఒకవైపు రోడ్డుపై నిలిపిన వాహనాలను పంపించి రోడ్డు చివరి వరకు వెళ్లి తిరిగి వచ్చేలోగా ఇతర వాహనాలు అడ్డంగా పెట్టేవాళ్లు. సీఐ అశోక్‌కుమార్ కొత్తగా ఆలోచన చేశారు. బస్టాండ్ రహదారి పొడవునా పబ్లిక్ అనౌన్సింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి మైకులు పెట్టించారు. పోలీసు సైరన్‌లు మోగిస్తూ అక్కడ ఉన్న కానిస్టేబుల్ రోడ్డుపై అడ్డంగా పెట్టిన కారు, బస్సు, ఆటో నంబర్ చెప్పి వెంటనే తీసివేయాలని సూచిస్తున్నారు. రోడ్లపై నిబంధనలు అతిక్రమించి వాహనలు నిలిపితే రూ.1,035 అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరిస్తున్నారు. వాహనాలు ఎక్కడపడితే అక్కడ రోడ్లపై పెట్టేసి వెళ్లిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. బస్టాండ్ ఎదురుగా బస్సులు, ఇతర వాహనాలు రోడ్లపై అడ్డదిడ్డంగా వెళ్లకుండా సిమెంట్ దిమ్మెలు అడ్డుగా పెట్టించారు. వాహనాలు క్రమపద్ధతిలో వెళ్లేలా ఇనుప బారికేడ్లతో మలుపులు ఏర్పాటు చేశారు.


ట్రాఫిక్ జామ్ అయ్యే చోట సిమెంట్ దిమ్మెలతో బారికేడ్లు

300 మందికి చరవాణుల అందజేత


చరవాణి అందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: చరవాణి (సెల్ ఫోన్) పోగొట్టుకొని ఫిర్యాదు చేసిన వారి ఫోన్లను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. బాధితులకు మంగళవారం పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగ చరవాణులను అందించారు. రూ.45 లక్షలు విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన 300 చరవాణులను గుర్తించి అందించినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఐటీ కోర్ సీఐ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది రాందాస్‌రెడ్డి, కిషోర్, శ్రీధర్, అరుణ, కరిముల్లా, రమేష్ పాల్గొన్నారు.


గుర్తించినవి..

గుంటూరు పశ్చిమ

మునిపల్లె రమణికి సత్కారం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆర్ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మునిపల్లె రమణి ఏకబిగిన 58 సినిమా పాటలు పాడి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించినందుకు మంగళవారం రాత్రి సన్మానం జరిగింది. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో జరిగిన సభలో తొలుత కార్యక్రమాన్ని చిరంజీవి నటించిన చలనచిత్ర గీతాలను ఆలపించారు. డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, కన్నా మాస్టారు, వాస్తు సిద్ధాంతి తలపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తెదేపా జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పప్పుల దేవదాస్ పాల్గొని రమణిని సత్కరించారు.

'అంబటి అవినీతిపై సిట్‌తో విచారణ జరిపించాలి'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి అంబటి రాంబాబు గత అయిదేళ్ల చేసిన అవినీతిపై సిట్‌ను నియమించి విచారణ జరిపించాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తెదేపా జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సత్తెనపల్లిలో మరుగుదొడ్డి శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన బలహీనవర్గాలకు చెందిన యువకుడికి ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారంలోనూ కక్కుర్తి పడ్డారు. చంద్రబాబు కూడా జగన్ వలే కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే వైకాపా నేతల్ని పెట్టేందుకు జైళ్ల సరిపోవని ధ్వజమెత్తారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

? వికాస్‌నగర్ 2వలైన్‌లో జీపీ పెర్ల్ అపార్ట్‌మెంట్ దగ్గరున్న వీధి దీపం(36/75/15/1ఎ/2) కొన్ని రోజులుగా వెలగడం లేదు. రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి. **- స్థానికులు, వికాస్‌నగర్**

✔ వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- రవికిరణ్, ఏఈ, జీఎంసీ

స్పందనకు వందనం

పిచ్చిమొక్కల తొలగింపు: శాంతినగర్ 5వలైన్ నుంచి తెలుగు వెలుగు అపార్ట్‌మెంట్‌కు వెళ్లే రహదారి పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన 85వ సచివాలయ శానిటరీ కార్యదర్శి జుబేరియ ఫర్విన్, పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పిచ్చిమొక్కలు తొలగింపజేశారు.

కాలువలో పూడికతీత: ఏటీ అగ్రహారం 7వ లైన్‌లో కాలువలు పూడుకుపోయి మురుగు నీరు ముందుకు కదలడంలేదు. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ ఆనంద్‌కుమార్‌కు తెలిపాం. ఆయన 89వ సచివాలయ శానిటరీ కార్యదర్శి సుశీలతో సిబ్బందిని పంపించి పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

సత్వర స్పందనతోనే రక్షణ

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: రైలు ప్రమాదాలు జరిగినప్పుడు అన్ని విభాగాల ఉద్యోగులు సత్వరమే స్పందించాలని ఎన్‌డీఆర్ఎఫ్ సహాయ కమాండర్ మహమ్మద్ అస్లాం సూచించారు. రైల్ వికాస్ భవన్ అమరావతి ఎనెక్స్ విభాగంలో భద్రతా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. గాయపడిన బాధితులను రైల్వే కోచ్‌ల నుంచి రక్షించడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలో మాక్ డ్రిల్ ద్వారా అస్లాం వివరించారు. సమావేశంలో ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మిథిలేష్ యాదవ్, సీనియర్ డీఎంఈ రవికిరణ్, డీసీఎం కమలాకర బాబు, ఏడీఎంఈ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో సాంకేతిక విద్యార్థులు

రాజేంద్రనగర్(గుంటూరు), పెదకాకాని(నంబూరు), న్యూస్‌టుడే

తరగతి గదులు, ప్రయోగశాలలోని పరికరాలతో కుస్తీ పట్టే సాంకేతిక విద్యార్థులు సమాజ సేవలో ముందుకు కదిలారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు 'స్వచ్ఛతా హీ సేవ'లో పాల్గొన్నారు. వీవీఐటీ, చిప్స్ కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పక్షం రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వారు ఏమేం చేశారో తెలుసుకుందాం.

వీవీఐటీ వాలంటీర్లు ఇలా..

- నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన వాలంటీర్లు ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఐ.ఎల్.జె.భక్తసింగ్ ఆధ్వర్యంలో 15 రోజులపాటు జరిగిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.
- ప్రతి వాలంటీర్ కనీసం 3 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి నంబూరులోని పంచాయతీ కార్యాలయానికి అందజేసి, సంబంధిత అధికారుల నుంచి ధ్రువపత్రాలు పొందారు.
- ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను నంబూరులో ర్యాలీ చేసి, జిల్లా పరిషత్తు పాఠశాల విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకుంటామని, మానవహారం ఏర్పాటు చేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.
- పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛభారత్ ప్రధానాంశంగా చిత్రలేఖనం, జానపద పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.
- వీవీఐటీ కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు.
- బాపట్లలోని సూర్యలంక బీచ్ పరిసరాల్లో చెత్తను ఏరివేశారు.


స్వచ్ఛతా హీ సేవలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీవీఐటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్

చిప్స్ విద్యార్థుల సేవ

- నగర శివారులోని చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ జంపని సుబ్బారావు పర్యవేక్షణలో వాలంటీర్లు స్వచ్ఛతా హీ సేవలో భాగంగా చౌడవరం, దాసరిపాలెం, యనమదల, చుట్టగుంట ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.
- ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలు, మాదక ద్రవ్యాలు వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన ప్రదర్శనలు నిర్వహించి కరపత్రాలు అందజేశారు.
- యనమదలలో ప్రభుత్వ, చౌడవరంలోని బ్రిలియంట్ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛభారత్‌పై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు.
- ఆయా గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలు దరిచేరవని తెలుపుతూ కరపత్రాలు ఇచ్చారు.
- రోడ్డు భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని గ్రామాల్లో యువతకు వివరించారు.
- గ్రామాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను సమీప గృహవాసులకు అప్పగించారు.


పరిసరాలను శుభ్రం చేస్తున్న చిప్స్ వాలంటీర్లు

వేదపరిషత్తు సేవలు ప్రశంసనీయం


మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వేదాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి తెలిపారు. పట్టాభిపురంలోని వేద పరిషత్తులో 51వ వేదశాస్త్ర పండిత సన్మాన సభలు మూడు రోజుల పాటు వైభవంగా జరిగాయి. మంగళవారం రాత్రి ముగింపు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయమూర్తి పార్థసారధి మాట్లాడుతూ 50 సంవత్సరాల నుంచి వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన వేద పరిషత్తు సేవలు నిరుపమానమన్నారు. తితిదే.. వేద పారాయణ పథకం ఏర్పాటు చేసి ఆర్థికంగా చేయూతనిస్తుండడం తెలిపారు. కంచి, శృంగేరి పీఠాలు.. వేద పండితులను ప్రోత్సహిస్తూ వేద విద్యను పరిరక్షించడం ఆనందదాయకమన్నారు. సభకు హరి సీతారామమూర్తి సల్లక్షణ ఘనపాఠి అధ్యక్షత వహించారు. వేద పరిషత్ అధ్యక్షుడు గట్టిమ శివరామకృష్ణప్రసాద్ తదితరులు ప్రసంగించారు. గుళ్ళపల్లి దత్తాత్రేయ ఘనపాఠి వేద స్వస్తి నిర్వహించారు. సభానంతరం వేద పండితులకు సత్కారాలు జరిగాయి.

గంజాయి బ్యాచ్ ఆగడాలు భరించలేకున్నాం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రెడ్డి కళాశాల పరిసర ప్రాంతాల ప్రజలు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎమ్మెల్యే మాధవి మంగళవారం 29వ డివిజన్‌లోని రెడ్డి కళాశాల పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. 30 మంది కళాశాల వెనుక వైపున్న గోడ దూకి లోపలికి ప్రవేశించి గంజాయి తాగుతున్నారని, అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారిపై దాడికి పాల్పడుతున్నారని వాచ్‌మెన్ వాపోయారు. గంజాయి తాగి మద్యం పడుతున్నారని, ప్రశ్నించిన వారిపై దాడి చేస్తున్నారని మహిళలు పేర్కొన్నారు. దీనికి ఎమ్మెల్యే మాధవి స్పందిస్తూ 'గత ప్రభుత్వంలో కొందరి స్వార్థం కోసం గంజాయి అమ్మకాలను ప్రోత్సహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి గంజాయి నగరంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నాం. అయినప్పటికీ కొందరు దొంగచాటుగా తీసుకొచ్చి అమ్ముతున్నారు. పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. అరాచకాలు చేసే ఆకతాయిలపై కేసులు నమోదు చేయించి జైలుకు పంపుతాం'.. అని హెచ్చరించారు.


గంజాయి బ్యాచ్ దాడి చేసేందుకు చెబుతున్న రెడ్డి కళాశాల వాచ్‌మెన్

గుంటూరుకు షీలాదీప్ బదిలీ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాల ఆప్తమాలజీ విభాగానికి సహాయ ఆచార్యులుగా షీలాదీప్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రస్తుతం విశాఖపట్నం ఆంధ్ర వైద్య కళాశాలలో పని చేస్తున్నారు. బదిలీలపై నిషేధం ఉన్నందున ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో జారీ చేసింది.

ఏపీవోగా మల్లేశ్వరి

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీఎంఈ కార్యాలయంలో కార్యాలయ పర్యవేక్షకురాలిగా పనిచేస్తున్న పి.మల్లేశ్వరికి సహాయ పర్సనల్ అధికారిగా పదోన్నతి లభించింది. ఉద్యోగోన్నతిపై ఆమెను విజయవాడ డివిజన్ మెకానికల్ విభాగంలో ఏపీవోగా బదిలీ చేస్తూ ద.మ.రైల్వే డిప్యూటీ సీపీవో అభిలాష్ యాదవ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అడుగు వేయాలన్నా ఆలోచించాల్సిందే..!



శారదాకాలనీ శివారు నుంచి శివారెడ్డిపాలెం లోకి వెళ్లే ప్రధాన మార్గం అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి పొడవునా గుంతలమయంగా మారడంతో చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. నగరపాలక సంస్థ స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గోరంట్ల**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. 29వ డివిజన్‌లో ఆమె 'మీతో నేను.. మీ వెంటే నేనే' కార్యక్రమం నిర్వహించారు. నల్లకుంట, భవానీపురం, ఇస్కాన్ టెంపుల్ ప్రాంతం, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో శానిటరీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పారిశుద్ధ్య సమస్యలు గుర్తించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డివిజన్‌లో ఉన్న మురుగునీరు, పిచ్చి మొక్కల్ని తొలగించారు. చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో పారిశుద్ధ్యం క్షీణించి రోగాల బారిన పడాల్సి వస్తోందన్నారు.

మల్లికార్జునపురం దారులు అధ్వానం



ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోని మల్లికార్జునపురం రహదారులు అధ్వానంగా ఉన్నాయి. స్థానికంగా అన్నీ భవనాలే అయినా నడిచేందుకు మాత్రం రోడ్లు సక్రమంగా లేవు. దీంతో అక్కడ ఉంటున్న నివాసులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వర్షమొస్తే ఇక రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని స్థానికులంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గోరంట్ల**

మహాలక్ష్మీ నమోస్తుతే..


మారుతీ దేవాలయ సంఘంలో..


బ్రాడీపేట లలితాపరమేశ్వరి ఆలయంలో..


విద్యానగర్ క్లబ్‌హౌస్ ఆదిత్రి ఎక్సోటికాలో..


బీఆర్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో


విద్యానగర్ సాయినాథ సన్నిధానంలో..


శ్రీనివాసరావుతోటలో కుంకుమ పూజలో భక్తులు


ఏటి అగ్రహారంలో పూజలో పాల్గొన్న భక్తులు


పోలేరమ్మ తల్లి గుడిలో



స్తంభాలగరువులో..


రామలింగేశ్వర స్వామి ఆలయంలో గాయత్రీ దేవి అలంకారం

ఏటీ అగ్రహారం, పట్టాభిపురం, గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నగరమంతటా వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం పలు దేవాలయాల్లో మహాశక్తి అంశాలైన మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి అలంకారాలను తీర్చిదిద్ది పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.


చుట్టగుంట పోలేరమ్మ గుడిలో..


మల్లారెడ్డినగర్‌లో..


కోదండ రామాలయంలో

ఆలపాటిని గెలిపించాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ అనుభవంతో పాటు మాజీ మంత్రిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ పని చేశారన్నారు. ఆయన్ను గెలిపించుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

పట్టాభిపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని ఎమ్మెల్యే మాధవి పిలుపునిచ్చారు. క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకోవాలన్నారు. నాయకులు కోవెలమూడి రవీంద్ర, గళ్లా రామచంద్రరావు పాల్గొన్నారు.

నూతన గురునిలయం ప్రారంభం


ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న బిషప్ భాగ్యయ్య

నగరంపాలెం, న్యూస్‌టుడే: గుంటూరు మేత్రాసన పీఠాధిపతిగా బిషప్ చిన్నాబత్తిని భాగయ్య ఎనిమిదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నగరంపాలెంలోని పునీత ఆంతోని వారి పుణ్యక్షేత్రంలో నూతన గురునిలయాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా భాగ్యయ్య హాజరై మాట్లాడారు. దేవుడిపై విశ్వాసంతో చేసే ప్రతి పని విజయవంతం అవుతుందన్నారు. ఫాదర్ కొచ్చర్ల జ్యోతిరాజు ఆంతోని వారి పుణ్యక్షేత్రంలో అనేక పనులు చేపట్టారన్నారు. ముందుగా పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పుణ్యక్షేత్ర విద్యుద్దీప నామకరణ బోర్డుకు సంఘ కమిటీ సభ్యుడు నేలపాటి జ్ఞాన ప్రకాశరావు రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర విచారణ గురువు జ్యోతిరాజు, విజయవాడ మేత్రాసన పీఠాధిపతి రాజారావు, విచారణ గురువులు నరిశెట్టి ఆంతోనిబాల, మద్దు బాల, డాక్టర్ దాసరి కిరణ్, మఠకన్యలు, విశ్వాసులు పాల్గొన్నారు.

విశ్రాంత డీజీపీ మాలకొండయ్యకు మాతృవియోగం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: విశ్రాంత డీజీపీ, విశ్రాంత పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలకొండయ్య మాతృమూర్తి రుక్మిణమ్మ (92) మంగళగిరిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గుంటూరు కొరిటెపాడులోని మహాప్రస్థానంలో రుక్మిణమ్మ భౌతికకాయానికి మాలకొండయ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన్ని మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, విశ్రాంత పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ తదితరులు పరామర్శించారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసిన ముగ్గురిపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలులో ఏఎస్ఐగా పని చేస్తున్న మాబాషాతో పాటు శ్రీదేవి, సంజయ్‌లు.. నిరుద్యోగులకు వల వేసి పోలీసు శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి మోసం చేస్తున్నారు. ఈ విధంగా గతంలోనూ చేసినందుకు మాబాషాను పోలీసు ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేశారు. అయినప్పటికీ ప్రవర్తనలో మార్పు రాలేదు. పండరీపురానికి చెందిన మోహిని వద్ద నుంచి పోలీసు శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి రూ.9,75,000 వసూలు చేశాడు. ఉద్యోగం ఇప్పించకపోగా.. డబ్బు ఇవ్వమంటే రూ.2,20,000 ఇచ్చి మిగతా సొమ్ము ఇవ్వకుండా బెదిరిస్తున్నారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అజంతా షూ కంపెనీ ప్రారంభం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: అరండల్‌పేట 4వలైన్‌లో అజంతా షూ కంపెనీని మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, కంపెనీ ఛైర్మన్ డాక్టర్ కె.వి.చలపతితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ పది మందికి పని కల్పించాలన్న ఉద్దేశంతో కేవీ చలపతి పరిశ్రమ స్థాపించారన్నారు. కంపెనీ ఛైర్మన్ డాక్టర్ కె.వి.చలపతి మాట్లాడుతూ యూరప్ ప్రజలకే కాకుండా, ఇక్కడి ప్రజలకు కూడా యూరప్ స్టాండర్ట్ కలిగిన నాణ్యమైన పాదరక్షలను అందుబాటు ధరల్లో అందించాలన్న సంకల్పంతో నాలుగో కంపెనీ గుంటూరులో ప్రారంభించామన్నారు. త్వరలో అన్ని పట్టణాల్లో ఈ కంపెనీని ప్రారంభిస్తామన్నారు.


షూ కంపెనీ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిరిధర్, కంపెనీ ఛైర్మన్ డాక్టర్ కేవీ చలపతి తదితరులు

కూలిన పాత గోడ.. ఒకరికి గాయాలు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో పురాతన భవనం తొలగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. అక్కడ పనులు పర్యవేక్షిస్తున్న వెంకటపతిరాజుపై రాళ్లు పడి భుజం, చేతికి గాయాలయ్యాయి. అతన్ని అత్యవసర విభాగానికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం చేతికి రక్త ప్రసరణ తగ్గిందని గుర్తించారు. అతనికి వెంటనే కార్డియో థొరాసిక్, వాస్కులర్ సర్జరీ విభాగం అధిపతి హరికృష్ణ నేతృత్వంలో సర్జరీ చేసి రక్త ప్రసరణ పునరుద్ధరించారు. అనంతరం ఆర్థో విభాగం ఆచార్యులు నారాయణరావు మార్గదర్శకంలో ఆపరేషన్ చేసినట్లు సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ తెలిపారు. అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. నాట్కో క్యాన్సర్ కేంద్రం వద్ద మరో 100 పడకల వార్డు నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో ఉన్న పాత భవనాన్ని తొలగిస్తుండగా ఆ వ్యక్తికి గాయాలైనట్లు తెలిపారు.

మార్కెట్లోకి నూతన ఉత్పాదనలు విడుదల

పట్టాభిపురం, న్యూస్‌టుడే: నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలు, అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించిన నూతన ఉత్పాదనలు గ్లాంజ్, బోస్‌నెట్ శిలీంద్రనాశినులు (తెగుళ్ల మందు), నాట్‌నెక్స్ట్ కీటకనాశిని మంగళవారం మార్కెట్లోకి విడుదల చేశారు. కార్యక్రమలో ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు రాజేష్ చెబియం, సేల్స్, మార్కెటింగ్ హెడ్ ఇండియా సార నర్సయ్య, సౌత్ సేల్స్ జడ్ఎం రామిశెట్టి మాలకొండయ్య, ఏపీ సేల్స్ మార్కెటింగ్ అజయ్ రెడ్డి పాల్గొన్నారు. రాజేష్ చెబియం, సార నర్సయ్య మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు గ్లాంజ్ సమర్థంగా పని చేస్తుందన్నారు. బోస్‌నెట్ మచ్చల తెగుళ్లను నివారిస్తుందని, నాట్‌నెక్స్ట్ కాయ తొలుచు పురుగు, నల్లి నివారణకు పని చేస్తుందని వివరించారు.


నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ ఉత్పాదనలు మార్కెట్లోకి విడుదల చేస్తున్న నిర్వాహకులు

300 మందికి చరవాణుల అందజేత

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: చరవాణి పోగొట్టుకొని ఫిర్యాదు చేసిన వారి ఫోన్లను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. బాధితులకు మంగళవారం పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా చరవాణులను అందించారు. రూ.45 లక్షలు విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన 300 చరవాణులను గుర్తించి అందించినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఐటీకోర్ సీఐ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది రాందాస్‌రెడ్డి, కిషోర్, శ్రీధర్, అరుణ, కరిముల్లా, రమేష్ పాల్గొన్నారు.

ఈనాడు సినిమా

రామ్‌చరణ్ - ప్రశాంత్ నీల్ కలయికలో!


రామ్‌చరణ్

రామ్‌చరణ్ సినిమాల విషయంలో వేగం పెంచుతున్నారు. ప్రస్తుతం ఆయన బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమాని పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. దీని తర్వాత సుకుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం చేసేందుకు పచ్చజెండా ఊపారు. ఇప్పుడీ జాబితాలో కొత్తగా మరో ప్రాజెక్ట్ చేరినట్లు తెలుస్తోంది. 'కేజీఎఫ్', 'సలార్' విజయాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఇప్పుడాయనతో చరణ్ ఓ సినిమా చేయనున్నారని సమాచారం. ఇప్పటికే దీనిపై చర్చలు పూర్తయినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్ట్‌ను డీవీవీ దానయ్య నిర్మించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రశాంత్ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో ఓ సినిమా చేసేందుకు సిద్ధమయ్యారు. దీని తర్వాత 'సలార్ 2', 'కేజీఎఫ్ 3' పూర్తి చేయాల్సి ఉంది. వాటి తర్వాతే రామ్‌చరణ్ ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశముంది. ఈలోపు బుచ్చిబాబు, సుకుమార్‌ల సినిమాలు పూర్తి చేయనున్నారు చరణ్.

ఆ రోజు విడుదల పక్కా


అల్లు అర్జున్

బాక్సాఫీస్ తుపాన్‌ని వీక్షించడానికి సిద్ధంగా ఉండాలంటూ ప్రేక్షకులకు పిలుపునిచ్చింది 'పుష్ప 2' బృందం. 'పుష్ప2' మొదటి సగ భాగం ఎడిటింగ్ పూర్తి చేసుకుని లోడ్ అయిపోయిందని, అంచనాల్ని మించి సినిమా ఉంటుందని చిత్రబృందం స్పష్టం చేసింది. చిత్రం డిసెంబరు 6న విడుదల పక్కా అని పునరుద్ఘాటిస్తూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాల్ని పేర్కొంది. 'పుష్ప' చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రం 'పుష్ప2'. అల్లు అర్జున్, రష్మిక జంటగా నటించారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా మరోవైపు నిర్మాణానంతర పనుల్ని పూర్తి చేసుకుంటోంది.


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పురస్కారం స్వీకరిస్తున్న మిథున్ చక్రవర్తి


రిషబ్‌శెట్టి


నిత్యామేనన్


మానసీ పరేఖ్

సమాజాన్ని మార్చడంలో సినిమాలదీ కీలక పాత్రే!


అభిషేక్ అగర్వాల్


చందూ మొండేటి

- జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును స్వీకరించిన మిథున్ చక్రవర్తి

"భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా సినిమాల్ని రూపొందిస్తోంది భారతీయ సినీరంగం. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద చిత్రపరిశ్రమ మాత్రమే కాదు.. కళారంగంలోనే ఎంతో వైవిధ్యమైనది" అన్నారు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. మంగళవారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో విజేతలకు పురస్కారాలు అందించారు ముర్ము. ఇందులో భాగంగా భారతీయ చలన చిత్రపరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మక 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డుతో నటుడు మిథున్ చక్రవర్తిని సత్కరించారు రాష్ట్రపతి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఈ రోజు దాదాపు 85మంది పురస్కారాల్ని అందుకున్నారు. అందులో మహిళలు కేవలం 15 మంది మాత్రమే ఉన్నారు. చిత్రపరిశ్రమలో మహిళల్ని ప్రోత్సహించేలా భవిష్యత్తులో మరిన్ని చిత్రాలు తీయడానికి దర్శకనిర్మాతలు ప్రయత్నిస్తారని ఆశిస్తున్నాను. సమాజాన్ని మార్చడంలో సోషల్ మీడియాతో పాటు సినిమా కూడా కీలకమైన పాత్ర పోషిస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్‌తో పాటు అవార్డుల జ్యూరీ బృందం పాల్గొంది.

- ఈ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో 'కాంతార' చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించిన కన్నడ కథానాయకుడు రిషబ్‌శెట్టి ఉత్తమ నటుడిగా పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ నటిగా నిత్యామేనన్ (తిరుచిత్రాంబలం), మానసీ పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్) అవార్డుల్ని సొంతం చేసుకున్నారు. ఉత్తమ చిత్రంగా 'ఆట్టమ్' (మలయాళం), ఉత్తమ దర్శకుడిగా సూరజ్ బర్జాత్యా (ఊంచాయి) పురస్కారాల్ని గెలుచుకున్నారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలిచిన 'కార్తికేయ 2'కు గానూ దర్శకుడు చందూ మొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ పురస్కారాల్ని అందుకున్నారు.

డబ్బులేదని ఆశయాలు వదలొద్దు

దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని స్వీకరించాక మిథున్ చక్రవర్తి స్పందిస్తూ.. "ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును తీసుకున్నందుకు నాకు గర్వంగా ఉంది. నా జీవితంలో ఏదీ అంత సులువుగా రాలేదు. ఎంతో కష్టపడ్డాను. నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం మీ ఆశీసులే అని నమ్ముతాను. మనదేశంలో ప్రతిభావంతులు చాలా మంది ఉన్నారు. నేను వారికి చెప్పాలనుకునేది ఒక్కటే. మీ దగ్గర లేనిది డబ్బు మాత్రమే.. అందుకోసం మీ ఆశయాలను ఎప్పుడూ వదులుకోకండి. కలలు కనండి వాటిని నెరవేర్చుకోవడం కోసం శ్రమించండి" అని చెప్పారు.

ఓ అందమైన ప్రయాణం... విశ్వం


టి.జి.విశ్వప్రసాద్, గోపీచంద్, శ్రీను వైట్ల, కావ్య థాపర్, వేణు దోనేపూడి

"నేను చాలా సినిమాలు చేశా. 'విశ్వం' ప్రయాణం ఎంతో సౌకర్యంగా అనిపించింది. అందుకు కారణం దర్శకుడు శ్రీను వైట్ల. ఆయన కథ చెబుతున్నప్పుడు, సెట్‌లో నటిస్తున్నప్పుడు బాగా నవ్వుకునేవాళ్లం. ఈ కథలో అంత అద్భుతంగా కామెడీ పండింది. యాక్షన్ కూడా అదే స్థాయిలో ఉంటుంద"ని చెప్పారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'విశ్వం'. కావ్య థాపర్ కథానాయిక. శ్రీనువైట్ల దర్శకుడు. వేణు దోనేపూడి, టి.జి.విశ్వప్రసాద్ నిర్మించారు. దసరా సందర్భంగా ఈ నెల 11న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. గోపీచంద్ మాట్లాడుతూ "'విశ్వం' శ్రీనువైట్ల మార్క్ సినిమా. ఈ సినిమాతో శ్రీనువైట్ల తన పూర్వ వైభవాన్ని చాటుతార"న్నారు. శ్రీనువైట్ల మాట్లాడుతూ "ఈ సినిమా ఓ అందమైన ప్రయాణం. ఈ చిత్రం అందరికీ వినోదాన్ని పంచుతుందని వందశాతం నమ్మకంతో చెబుతున్నా" అన్నారు. కార్యక్రమంలో కావ్య థాపర్, టి.జి.విశ్వప్రసాద్, వేణు దోనేపూడి, శ్రీరామ్ ఆదిత్య, మహేశ్, అనీషా ఆంబ్రోస్, చేతన్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


సమంత, అలియా భట్

తెలుగు ప్రేక్షకుల్ని మించినోళ్లు లేరు: అలియా

"కొన్ని సినిమాల ట్రైలర్లు, ప్రచార చిత్రాలు చూస్తుంటే అవి మనల్ని 'రా.. చూడు' అని పిలుస్తున్నట్లు ఉంటుంది. ఈ 'జిగ్రా' ట్రైలర్ చూశాక నాకదే అనుభూతి కలిగింది" అన్నారు దర్శకుడు త్రివిక్రమ్. అలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో వాసన్ బాలా తెరకెక్కించిన చిత్రమే 'జిగ్రా'. ధర్మ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 స్టూడియోస్, ఎటర్నల్ షైన్ ప్రొడక్షన్స్ సంస్థలు నిర్మించాయి. ఈ సినిమాని ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా రానా దగ్గుబాటి ఈ నెల 11న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుకను నిర్వహించారు. దర్శకుడు త్రివిక్రమ్, నటి సమంత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలియా భట్ మాట్లాడుతూ.. "ఆర్ఆర్ఆర్' ద్వారా నాకు తెలుగు భాషతో ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. మంచి సినిమాల్ని ఆదరించడంలో తెలుగు ప్రేక్షకుల్ని మించిన వారు లేరు. కచ్చితంగా 'జిగ్రా' అందరికీ నచ్చుతుంది" అంది. ఈ కార్యక్రమంలో రానా, వాసన్ బాలా, వేదాంగ్, రాహుల్ రవీంద్రన్ తదితరులు పాల్గొన్నారు.


ఆఖరి దశలో ఓదెల 2

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

పట్టేస్తుందన్నారు.. పర్యవేక్షణ మరిచారు


పుట్టిన శిశువుకు ఇలా ట్యాగ్ వేయాలి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే

- సక్రమంగా అమలు కాని ఆర్ఎఫ్ఐడీ విధానం
- జీజీహెచ్‌లో ఆగని శిశువుల అపహరణ ఘటనలు

సర్వజనాసుపత్రిలో తల్లీ బిడ్డల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్ఎఫ్ఐడీ) విధానం సక్రమంగా అమలు కావడంలేదు. దీన్ని పర్యవేక్షించేవారే కరవయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బిడ్డ పుట్టగానే తల్లీబిడ్డకు ట్యాగ్‌లు వేయాలి. శిశువును తల్లి కాకుండా ఇతరులు ఎవరైనా వార్డు దాటి తీసుకెళ్తుంటే ఈ ట్యాగ్ ఇట్టే పట్టేస్తుంది. సోమవారం అపహరణకు గురైన నవజాత శిశువుకు ఈ ట్యాగ్ వేయకపోవడం గమనార్హం. దీనికి ఎవరు బాధ్యత వహించాల్సి ఉంటుందో విచారణలో తేలాల్సి ఉంది.

24 గంటలూ విధుల్లో ఉండాల్సిందే

సర్వజనాసుపత్రిలో ప్రసవాలు నిరంతరం జరుగుతుంటాయి. అందువల్ల ఆర్ఎఫ్ఐడీ కేంద్రంలో ఉద్యోగులు 24 గంటలు పనిచేస్తూ ఉండాలి. కాన్పు కాగానే వెంటనే ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్ వేయాలి. అనంతరం కంప్యూటర్ ద్వారా ట్యాగ్‌ల పనితీరును పరీక్షిస్తూ ఉండాలి. ఇక్కడ పనిచేసే సిబ్బంది రాత్రి వేళల్లో ఉండడంలేదని సూపరింటెండెంట్ తనిఖీల్లో తేలింది. గుత్తేదారు ప్రతినిధిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సిబ్బందిని ఇటీవలే పెంచారు. అయినప్పటికీ వారిలో జవాబుదారీతనం కనిపించడంలేదు.



జీజీహెచ్‌లో ఆర్ఎఫ్ఐడీ కార్యాలయం

ఎవరు పర్యవేక్షించాలి?

ప్రసూతి విభాగంలో కాన్పు జరిగిన వెంటనే తల్లీ బిడ్డలకు ట్యాగ్ ఎవరు వేయించాలి? బాధ్యత ఎవరిది? వేయించకపోతే ఎవరిని శిక్షించాలి? అనే విషయాలపై పూర్తిగా స్పష్టత కరవైంది. గుత్తేదారుడు నియమించిన సిబ్బంది సక్రమంగా పని చేస్తున్నారా? లేదా అన్నది పర్యవేక్షణ కరవైంది. అందువల్లే తెల్లవారుజామున బిడ్డ జన్మించినప్పటికీ మధ్యాహ్నం వరకు ట్యాగ్ వేయకపోయినా ఎవరూ గుర్తించలేదు. దీనివల్ల బిడ్డను అపహరించడం సులువైంది.

నిఘా కెమెరాల్లా ట్యాగ్‌లు

ఈ ట్యాగ్‌ల వల్ల అపహరణ, శిశువుల తారుమారు చేయడం వంటివి జరిగితే వెంటనే పట్టుకోవచ్చు. తల్లి కాకుండా ఇతరులు బిడ్డను వార్డు బయటికి తీసుకొస్తే పెద్ద శబ్దం వస్తుంది. ఆర్ఎఫ్ఐడీ కార్యాలయంలో పని చేసే సిబ్బందికి తెలిసిపోతుంది. దీనివల్ల బిడ్డల అపహరణను పూర్తిగా నియంత్రించవచ్చు. కేవలం పర్యవేక్షణ లోపం, అక్కడ పని చేసే సిబ్బంది నిర్లక్ష్యంతోనే నవజాత శిశువు అపహరణకు గురైందని పలువురు వైద్యులే వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.

గుత్తేదారుకు తాఖీదు

ఆర్ఎఫ్ఐడీ గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున సోమవారం తాఖీదు ఇచ్చినట్లు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. గతంలోనూ అతను నిబంధనల ప్రకారం పని చేయడంలేదని గుర్తించి నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. కాంట్రాక్టరు నుంచి సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది పర్యవేక్షణ ఉండేవిధంగా చూస్తామన్నారు.

ప్రజాహిత పాలన వైకాపాకు తెలియదు

మంత్రి నాదెండ్ల మనోహర్

నగరంపాలెం(గుంటూరు), న్యూస్‌టుడే: భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరులోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో మంత్రి మనోహర్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. ప్రజాహిత పాలన వైకాపాకు తెలియదన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కేవలం బటన్ నొక్కడమే చేశారని ఎద్దేవా చేశారు. అవగాహన, ఓపిక, పాలనాదక్షత వైకాపాకు లేవన్నారు. ముఖ్యంగా ఏపీలో పెట్టుబడులు రావడానికి కొంచెం సమయం పడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న చొరవతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో సమస్యలను సృష్టించేందుకు వైకాపా విషపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. వారి హయాంలో సంస్కృతి, భాష, విద్యకు ఎలాంటి నష్టం చేకూర్చారో అందరికీ తెలుసునన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఏ ఒక్కరి కోసమో నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు. దేశ క్షేమం, ప్రజల భవిత కోసం ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశంలో అన్ని మతాలు కలిసి ఉండాలని, ఎవరి ధర్మాన్నయినా గౌరవించాలని పవన్ చెప్పడం తప్పెలా అవుతుందన్నారు. ఇటీవల విజయవాడలో వరద విపత్తును కూడా వైకాపా రాజకీయం కోసం వాడుకోవడం సిగ్గుచేటన్నారు. సేవ చేయాల్సిన అంశంలో రాజకీయం చేయడమే వైకాపా లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. సమస్యలను సృష్టించి దేవాలయాలపై దాడులకు పాల్పడిన నీచమైన చరిత్ర వైకాపా పాలనలో చోటుచేసుకుందని ధ్వజమెత్తారు. విజయవాడ వరద బాధితులకు పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ నాయకులు, శ్రేణులు ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, నాయకులు చిల్లంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రోశయ్య, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సబ్ రిజిస్ట్రార్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి పరిధిలోని 3 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అనుబంధంగా మరో తొమ్మిది అనుబంధ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తూ ఈ నెల 4న రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి సిసోదియా ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా ఆయా కార్యాలయాలకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌లను నియమిస్తూ ఆయన మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు సీఆర్డీఏ తిరిగి ఇచ్చే స్థలాల రిజిస్ట్రేషన్లు మాత్రమే వీటిల్లో జరగనున్నాయి. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పని చేస్తాయి. ఈ నేపథ్యంలో అనుబంధ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు రెవెన్యూ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై 9 మంది అధికారులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా నియమించారు. మొత్తం మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు మండలాల పరిధిలోని 9 సీఆర్డీఏ యూనిట్‌ల పరిధిలో 15 గ్రామాలకు సేవలందించే విధంగా నియామకాలు చేశారు. ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములు తీసుకోవడం, రిజిస్ట్రేషన్లు చేసే ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా అనుబంధ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తుంది.

సీఆర్డీఏ యూనిట్	రిజిస్ట్రేషన్ అధికారి
నవులూరు	వై. శివశంకర్ (ఉప తహసీల్దార్)
కురగల్లు	జి. మురళీధర్ (తహసీల్దార్)
నిడమర్రు	కె. ఆంజనేయులు (తహసీల్దార్)
ఉండవల్లి	టి. నాగరాజు (ఉప తహసీల్దార్)
పెనుమాక	ఎం. శ్రీహరి (ఉప తహసీల్దార్)
రాయపూడి	పి. సతీష్ (తహసీల్దార్)
ఉద్దండరాయునిపాలెం	సి. హెచ్. మదన్ కిషోర్ (ఉప తహసీల్దార్)
వెలగపూడి	డి. సునీల్ బాబు (తహసీల్దార్)
వెంకటపాలెం	అబ్దుల్ రెహమాన్ మస్తాన్ (తహసీల్దార్)

28 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

చేబ్రోలు: రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 28 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చేబ్రోలు ఎస్సై వెంకట కృష్ణ కథనం మేరకు.. నారాకోడూరు వద్ద మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి నుంచి గుజరాత్‌కు తరలిస్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో 25 టన్నుల రేషన్ బియ్యం ఉండటంతో డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గుంటూరుకు చెందిన వ్యాపారి నగరంలో 3 టన్నుల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి టాటాఏస్ వాహనంలో వేమూరుకు తరలిస్తుండగా మంచాలలో వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మంచాల, చేబ్రోలు వీర్వోల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రతి వైద్యుడికి నైతిక విలువలూ ముఖ్యమే



సుబ్బారావును సన్మానిస్తున్న టీటీకే రెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థులు రోగులను పరీక్షించి అనుభవపూర్వకంగా నేర్చుకోవాలని పూర్వ ప్రిన్సిపల్ సుబ్బారావు సూచించారు. గుంటూరు వైద్య కళాశాల వార్షిక వేడుకలు మంగళవారం జింకాన ఆడిటోరియంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ ఆసుపత్రి వార్డుల్లో ఎక్కువ సమయం గడిపితే రోగులకు చికిత్సలకు సంబంధించిన అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. రోగిని చూడకుండా వంద పుస్తకాలు చదివినా ప్రయోగాత్మక పరిజ్ఞానం రాదన్నారు. వైద్య విద్యలో బట్టీ విధానం సరి కాదన్నారు. అంతర్జాలంపైనే ఆధారపడి చదువుకుని బయటకు వస్తున్న వారు ఉత్తమ వైద్యులుగా రాణించలేకపోతున్నారన్నారు. రోగులతో ప్రేమగా మాట్లాడాలన్నారు. మాటలే కాదు వృత్తిగత ప్రవర్తన, నైతిక విలువలూ ప్రతి వైద్యుడికి ముఖ్యమన్నారు. అనంతరం సుబ్బారావును సన్మానించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సమావేశంలో ప్రిన్సిపల్ టీటీకే రెడ్డి, ఉప ప్రిన్సిపల్స్ ప్రభాకరరావు, శ్రీధర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్లు ఉమా జ్యోతి, శ్రీనివాసప్రసాద్, జింకాన స్థానిక సమన్వయకర్తలు బాలభాస్కరరావు, హనుమంతరావు, నాట్కో సమన్వయకర్త అశోక్‌కుమార్, పలువురు వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో ఎంపీటీసీగా ఎన్నిక

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం పొంది ఎన్నికల్లో ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఘటన ఇది. వివరాల్లోకి వెళ్తే... 2020 మార్చిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. అధికారులు మండలంలోని తుమ్మలపాలెం ఎంపీటీసీ బీసీ మహిళకు కేటాయించారు. దీనికి పోటీ చేసేందుకు అదే గ్రామానికి చెందిన మేరుగ సుభాషిణి ఎస్సీ మాల ధ్రువపత్రం కోసం తహసీల్దారుకు దరఖాస్తు చేయగా పత్రం మంజూరు చేశారు. తుమ్మలపాలెం ఎంపీటీసీ స్థానం బీసీ మహిళకు కేటాయించిన విషయం తెలుసుకొని నామపత్రాల్లో తన కులం బీసీ- సీ అని రాసి మేరుగ సుభాషిణి స్వతంత్ర్య అభ్యర్థిగా నామపత్రాలు దాఖలు చేశారు. ఆ సమయంలో కుల ధ్రువపత్రం ఇవ్వలేదు. తర్వాత సమగ్ర శిక్షా సహాయ ప్రాజెక్టు సమన్వయకర్త నుంచి బీసీ- సీ పత్రం పొంది రిటర్నింగ్ అధికారికి అందించారు. ఈ ఎంపీటీసీ స్థానంలో నాలుగు నామినేషన్లు దాఖలు కాగా, మూడు నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో 2020, మార్చి 14న మేరుగ సుభాషిణి స్వతంత్ర్య అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటి హోం మంత్రి మేకతోటి సుచరిత వద్దకు వెళ్లి వైకాపాలో చేరారు.

లోకాయుక్త ఆదేశాలతో విచారణ

ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ యనమదలకు చెందిన సామాజిక కార్యకర్త జింకా బాజీబాబు యాదవ్ లోకాయుక్తాకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు జిల్లా స్థాయి స్క్రూట్నీ కమిటీ విచారణ చేపట్టింది. మేరుగ సుభాషిణి ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన వారని విచారణలో తేలింది. దీంతో బీసీ- సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేశారు. ఈ నివేదికను లోకాయుక్తకు పంపడంతో తగిన చర్యలు తీసుకోవాలని అందిన ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసుకు ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ కె.నాగలక్ష్మి దృష్టికి తీసుకెళ్లి మేరుగ సుభాషిణిపై తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

13న గుంటూరులో ఇండియా పోస్టు రన్



పోస్టర్లు, టీ- షర్టులు ఆవిష్కరిస్తున్న పోస్టల్ అధికారులు తదితరులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకొని ఏపీ సర్కిల్ తపాల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న గుంటూరులో ఇండియా పోస్టు రన్- 2024ను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని విజయవాడ పోస్ట్ మాస్టర్ జనరల్ డి.ఎస్.వీఆర్ మూర్తి పేర్కొన్నారు. 'ఫిట్ ఇండియా- ఫిట్ ఆంధ్రప్రదేశ్' నినాదంతో పౌరులందరిలోనూ ఆరోగ్యపరమైన జీవన విధానం అలవర్చాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఏపీ- ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో ఇందుకు సంబంధించిన టీ-షర్టులు, పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. గుంటూరు లాడ్జి సెంటర్‌లోని ఆంధ్ర లూథరన్ కళాశాల ఆవరణలో రన్ ప్రారంభమవుతుందని, దీనికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. రన్ నిర్వహణకు సహకారం అందిస్తున్న ఎస్ఆర్ఎం యూనివర్శిటీ యాజమాన్యానికి మూర్తి కృతజ్ఞతలు తెలిపారు. మూడు విభాగాల్లో నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొనే వారి వయసు, దూరాన్ని బట్టి 10కె, 5కె, 3కె రన్‌లను నిర్వహిస్తామని అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.సుధీర్ బాబు తెలిపారు. ఇప్పటి వరకు 1000 మంది ఆన్‌లైనులో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఇంజినీర్ ఇన్ చీఫ్ నయిముల్లా, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహోన్నతం!



మహాక్రతువుకు రూ.101.44 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు

దసరాల్లో నిత్యం 20 వేల మందికి..

- న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి



జగన్మాత దీవెనతో..

'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అని భారతీయ సనాతన ధర్మం బోధిస్తుంది. అన్ని దానాల్లో సంతృప్తి కలిగించే ఏకైక దానంగా భావిస్తారు. ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అన్నదానం ట్రస్టు పేరుతో 1991 జనవరి 1న రూ.15 లక్షల నిధులతో అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ ట్రస్టులో 58 మంది సభ్యులు ఉన్నారు. 2024 జూన్ 1 నాటికి 1,60,403 మంది దాతలు ఇందులో చేరారు. దాతలు ఇచ్చిన వాటిని 60 ఫిక్స్‌డ్ డిపాజిట్లలో రూ. 101,44,97,365 ఉంది. వీటిపై సంవత్సరానికి రూ. 7,26,52,247 వడ్డీ వస్తుంది. ఇది కాక నిత్యం దాతలు ఇచ్చే విరాళాల ద్వారా రూ. 15,92,735 సరాసరి వస్తోంది. అన్నప్రసాదంతోపాటు దసరాల్లో భక్తులకు ఉదయం, సాయంత్రం 30 వేల మంది భక్తులకు అల్పాహార పంపిణీకి కూడా ఏర్పాట్లు చేశారు. దద్దోజనం, కట్టె పొంగలి ప్రసాదాలను భక్తులకు వితరణ చేస్తున్నారు.

విరాళాలపై వచ్చిన వడ్డీతో ..

దాతలు ఇచ్చిన విరాళాలపై వచ్చే వడ్డీతో మాత్రమే భక్తులకు ఉచిత అన్నప్రసాదంగా దేవస్థానం పంపిణీ చేస్తోంది. సాధారణ రోజుల్లో 4 వేల మందికి, శుక్ర, ఆదివారాల్లో 5 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేస్తారు. దసరా ఉత్సవాల పది రోజులు, భవానీ దీక్షల ఐదురోజులు కలిపి 3 లక్షల మందికి అన్నప్రసాదాన్ని దేవస్థానం అందజేస్తోంది.



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

అత్యంత రుచికరం...

భక్తులు కడుపు నిండేలా ఆహారం పెట్టేందుకు దేవస్థానం అధికారులు మెనూ నిర్ణయించారు. ప్రతి రోజు పులిహోర ప్రసాదం, అన్నం, పప్పు, కూర, పచ్చడి, సాంబారు, మజ్జిగతో అన్నప్రసాదం పంపిణీ చేస్తారు. సుమారుగా ప్రతి భక్తుని కోసం రూ.51 చొప్పున ఖర్చు చేస్తున్నారు.





రూ.30 కోట్లతో నూతన భవనం...

శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం రూ.30 కోట్లతో నూతన అన్నదాన భవన నిర్మాణం చేపడుతోంది. బేస్‌మెంట్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం అదేస్థలంలో పిల్లర్ల నడమ వ్యయప్రయాసలకు ఓర్చి భక్తులకు అన్నప్రసాద పంపిణీకి తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. పది రోజుల కిందట వరకు అడుగు తీసి వేయలేని పరిస్థితి నుంచి భక్తులు క్యూలైన్లో వెళ్లి అన్నదానం స్వీకరించే వీలుగా ఏర్పాట్లు చేశారు.

మరిన్ని షామియానాలు వేస్తాం

- దేవస్థానం డీఈ రవీంద్ర

అన్నదాన భవనం నిర్మాణంలో ఉన్నందున పిల్లర్లు అడ్డుగా వచ్చిన చోట షామియానా వేయలేదు. ఆప్రాంతానికి తగినట్లు చిన్న షామియానా వేసేందుకు చర్యలు తీసుకుంటాం. మూలా నక్షత్రం నుంచి భక్తులు లక్షలాదిగా తరలి వస్తారు. అందుకు తగినట్లు క్యూలైన్లలో ఏర్పాట్లు చేస్తాం.

అత్యంత ఇష్టంగా స్వీకరిస్తాం



దుర్గగుడి అన్నప్రసాదాన్ని అత్యంత ఇష్టంగా స్వీకరిస్తాం. దేవస్థానం భక్తుల కోసం స్వీటు, పులిహోర, సాంబారు, కూర, చట్నీ, పప్పు ఏర్పాటు చేయడంతో ఇంటి భోజనం కంటే మిన్నగా ఉంది. భక్తులకు సరిపోయేలా కూర, పప్పు రెండో సారి కూడా వేస్తే బాగుంటుంది.

– సుచరిత, సనీత, యశస్విన్ (సత్యనారాయణపురం)

చాలా బాగుంది..



దేవస్థానం అన్నప్రసాదం చాలా బాగుంది. అయితే అన్నదాన భవనం నిర్మాణంలో ఉన్నందున కొంత మేర మాత్రమే షామియానాలు వేశారు. ఎండలో ఎక్కువ సేపు వేచి ఉండే వారికి ఇబ్బంది ఎదురవుతోంది. ఈవిషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురావాలి.

– ఆవులయ్య, గురవమ్మ (చెన్నంపల్లి, ప్రకాశం జిల్లా)

అమ్మ అనుగ్రహంతో



అమ్మవారి దర్శనానికి వచ్చినప్పుడల్లా అన్నప్రసాదం స్వీకరిస్తాం. ఇంట్లో భోజనం కంటే రుచిగా, శుచిగా ఉంటుంది. అమ్మవారి అనుగ్రహం ఉన్నంత వరకు భక్తుల అన్నప్రసాద పంపిణీకి లోటు ఉండదు. దసరా ఉత్సవాల్లో సైతం అదే నాణ్యతతో భక్తులకు అందజేస్తున్నారు.

- నాగలక్ష్మి, దుర్గ (కృష్ణలంక)

వీఐపీలు దర్శన వేళలు పాటించాలి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: వీఐపీలు దర్శన వేళలు పాటించి సామాన్య భక్తులకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై మహాలక్ష్మి అలంకారంలో కొలువుదీరిన దుర్గమ్మను డీజీపీ ద్వారకా



డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు, పక్కన సీపీ రాజశేఖర్‌బాబు

తిరుమలరావు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలా నక్షత్రం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు సిబ్బంది సమయోచితంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీ రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.

బెంగళూరు పుష్పాలతో అంతరాలయం ధగధగ

రోజూ సుమారు రూ. 1.50 లక్షల ఖర్చు



వివిధ రకాల పూలతో తీర్చిదిద్దిన అంతరాలయం

కేదారేశ్వరపేట, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో ప్రతి రోజూ అంతరాలయంలో నిర్వహిస్తున్న పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. బెంగళూరు, మహారాష్ట్ర, కర్ణాటక, ఊటీ తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక పుష్పాలతో ఆలయ సన్నిధిని అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. సుమారు 50 మందికి పైగా కార్మికులు ప్రతి రోజూ రాత్రి 11.30 నుంచి ప్రారంభించి తెల్లవారుజాము 2.30 వరకు అలంకరణ చేస్తున్నారు. పింక్ గ్లాడ్, పర్పుల్ గ్లాడ్, నైట్ గ్లాడ్, పింక్‌సోలో బాల్స్, నైట్‌గ్లేడర్, బ్లూడైస్, నైట్ డైస్ తదితర ప్రత్యేకమైన పుష్పాలు ఆలయంలో కనువిందు చేస్తున్నాయి. పుష్పాలంకరణకు ప్రతి రోజూ సుమారు రూ. 1. 50 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మూలా నక్షత్రంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి సారి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనుండడంతో బుధవారం రోజు ప్రత్యేక అలంకరణతో ఆలయాన్ని మరింత అందంగా తీర్చిదిద్దనున్నట్లు అంతరాలయ పుష్పాలంకరణ ఇన్‌ఛార్జి కొండాయిగుంట బలరామ్ తెలిపారు.

కాణిపాకం గణపయ్య తరఫున సారె సమర్పణ



సారె తీసుకొస్తున్న కాణిపాకం ఆలయ ఈవో గురుప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, సీపీ రాజశేఖర్‌బాబు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలను పురస్కరించుకొని జగన్మాత దుర్గమ్మకు కాణిపాకం వినాయక దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు, సారెను మంగళవారం సమర్పించారు. ఈవో గురుప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు మేళతాళాల నడుమ సారెను ఈవో రామారావు, వైదిక కమిటీ సభ్యులకు అందజేశారు. తొలుత వారికి దుర్గగుడి ఏసీ సాంబశివరావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

సత్యదేవుని సన్నిధి నుంచి...

చిట్టినగర్, న్యూస్‌టుడే: మహాలక్ష్మిగా కొలువుదీరిన విజయవాడ దుర్గమ్మకు మంగళవారం అన్నవరం దేవస్థానం తరఫున అధికార బృందం పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఆలయ ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ ఐవీ రోహిత్, ఏఈవో కొండలరావు, సిబ్బంది పసుపు, కుంకుమ, పండ్లు, పట్టు వస్త్రాలు తీసుకురాగా దుర్గ గుడి ఆలయ ఈవో, వేద పండితులు మేళతాళాలతో వారికి స్వాగతం పలికారు.



అమ్మవారికి సారె తెస్తున్న అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్, అధికారులు

ప్రిపరేషన్ టెక్నిక్

కొంతమంది బాగా చదువుతారు. అడిగిన వెంటనే ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పేస్తారు. కానీ పరీక్షల్లో మంచి మార్కులు రావు. ఎందుకంటే, అన్ని ప్రశ్నలకు నిర్ణీత సమయంలో జవాబులు రాయలేకపోతారు. అందుకే సమాధానాలు రాయడాన్ని, లెక్కలు చేయడాన్ని రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయాలి.

కరెంట్ అఫైర్స్



■ 2024, జులై 1 నుంచి 15 వరకు మైత్రి ఎక్సర్‌సైజ్–2024' పేరిట ఏ రెండు దేశాల మధ్య సంయుక్త సైనిక విన్యాసాలను నిర్వహించారు?

జ: భారత్-థాయ్‌లాండ్ (థాయ్‌లాండ్‌లోని తక్ ప్రావిన్స్‌లోని ఫోర్ట్ వచిర ప్రకాన్ వద్ద ఇండియన్ ఆర్మీ, రాయల్ థాయ్ ఆర్మీలు ఈ సైనిక విన్యాసాల్లో పాల్గొన్నాయి. 2006 నుంచి 'మైత్రి ఎక్సర్‌సైజ్' పేరిట.

మాదిరి ప్రశ్నలు


భారత్-థాయ్‌లాండ్‌ల మధ్య సైనిక సహకారాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ సంయుక్త సైనిక విన్యాసాలను నిర్వహిస్తున్నారు. మైత్రి ఎక్సర్‌సైజ్‌ను చివరిసారిగా 2019లో మేఘాలయలో నిర్వహించారు.)

■ అఫ్గానిస్థాన్‌కు సంబంధించి మూడో ఐక్యరాజ్యసమితి సదస్సును 2024 జూన్ 30, జులై 1వ తేదీల్లో ఎక్కడ నిర్వహించారు?

జ: ఖతార్ రాజధాని దోహా. (అఫ్గానిస్థాన్‌పై తొలి రెండు ఐక్యరాజ్యసమితి సదస్సులను దోహాలో వరుసగా 2023 మే, 2024 ఫిబ్రవరిలో నిర్వహించారు. మూడో సదస్సుకు తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్, భారత్ నుంచి విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి జేపీ సింగ్, ఐరాస నుంచి రాజకీయ, శాంతి నిర్మాణ వ్యవహారాల అండర్ సెక్రటరీ జనరల్ రోజ్‌మేరీ డికార్లో హాజరయ్యారు. అఫ్గానిస్థాన్‌పై నియంత్రణ తీసుకున్న తర్వాత తాలిబన్ ప్రతినిధి తొలిసారిగా ఈ సదస్సుకు హాజరయ్యారు.

మరింత సమాచారం

సీనియర్ ఇంటర్ తెలుగు — ప్రశ్నలు జవాబులు



వేయి అశ్వమేధాల కంటే సత్యమే గొప్పది !

6 మార్కులు

సత్య ప్రాశస్త్యం

1) సత్య ప్రాశస్త్యాన్ని గురించి శకుంతల ఏమని పలికింది?

జ: సత్యవాక్య ప్రాశస్త్యం: శకుంతల తన భర్త అయిన దుష్యంతుడితో సత్యం యొక్క గొప్పతనాన్ని గురించి ఇలా చెప్పింది.

★ మంచినీటితో నింపిన నూరు నూతుల కంటే ఒక దిగుడు బావి మేలు. అటువంటి దిగుడు బావుల కంటే ఒక మంచి యజ్ఞం మేలు. అట్టి నూరు యజ్ఞాలకంటే ఒక పుత్రుడు మేలు; నూరు మంది పుత్రుల కంటే ఒక సత్యవాక్యం మేలు. ★ ఒక త్రాసులో వేయి అశ్వమేధాలను ఒక వైపున, ఒక సత్యవాక్యాన్ని మరొకవైపున ఉంచి తూస్తే సత్యం వైపు బరువు ఉండటం వల్ల సత్యవాక్యము ఉన్నవైపుకే ముల్లు చూపిస్తుంది. వేయి అశ్వమేధముల కంటే సత్యవాక్యమే గొప్పదని దీనిని బట్టి తెలుస్తుంది. ★ పుణ్యతీర్థాలు అన్నింటికీ వెళ్లడం, వేదాలను అన్నింటిని అధ్యయనం చేయడం అనేవి, ఒక్క సత్యవాక్యంతో సమంకావు. ధర్మం బాగా తెలిసిన రుషులు, అన్ని ధర్మాల కంటే, సత్యవాక్యమే గొప్పదని అంటారు. కాబట్టి సత్యవాక్యం గొప్పది అని గుర్తించి, కణ్వాశ్రమంలో నీవు చేసిన ప్రతిజ్ఞను నేరవేర్చుము. నీ కుమారుడిని దయతో చూడుము.

2) దుర్మతి కిహముం బరముఁ గలదే. (సందర్భం - 3 మార్కులు)

జ: కవి పరిచయం: ఈ వాక్యం నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతంలోని చతుర్థాశ్వాసము నుంచి గ్రహించిన సత్యప్రాశస్త్యము అనే పద్యభాగంలోనిది.

సందర్భం: శకుంతల తన కుమారుడు భరతుడిని వెంట పెట్టుకొని, దుష్యంతుని వద్దకు వచ్చి తనకు ఇచ్చిన మాట ప్రకారం కుమారుడిని, తనను స్వీకరించమని కోరింది. దుష్యంతుడు తాను ఆమెను ఎరుగనని చెప్పాడు. పతివ్రత, గుణవంతురాలు, సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను, తిరస్కార దృష్టితో చూసి అవమానించిన దుర్బుద్ధికి ఇహ, పర సుఖాలు ఉండవని, అప్పుడు శకుంతల దుష్యంతుడితో చెప్పిన సందర్భంలోనిది.

వ్యాఖ్య: యోగ్యురాలైన భార్యను అవమానించి, తిరస్కరిస్తే ఆ భర్తకు ఈ లోకంలోను, పరలోకంలోను సుఖం ఉండదని శకుంతల భర్తకు గుర్తుచేసింది.

ముఖ్యమైనవి మరికొన్ని..

1) గృహస్థ ధర్మం గొప్పతనాన్ని, గృహిణి ప్రాధాన్యాన్ని గురించి శకుంతల తెలిపిన తీరును వివరించండి. 6 మా.

2) జీవులకు హృద్యంచే కడున్ శీతమే. (సందర్భం-3 మా.)

జవాబుల కోసం

- ఎం. మహేశ్వర నాయుడు

సహజశక్తికి తరగని నిల్వలు!

ప్రపంచవ్యాప్తంగా ఇంధన రంగంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోలియం స్థానంలో సహజ శక్తివనరుల వినియోగం వేగంగా పెరుగుతోంది. శిలాజ ఇంధనాల లభ్యతకు ఉన్న పరిమితులు, వాటి వాడకంతో తలెత్తే సమస్యలను గుర్తించిన ప్రపంచం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని సౌరశక్తి, పవనశక్తి, హైడ్రోజన్ శక్తి ఉత్పత్తి వైపు కదులుతోంది. సహజ వనరులైన నీరు, సూర్యరశ్మి, పవనాలు, సముద్ర తరంగాలు, భూమి నుంచి వెలువడే ఉష్ణం, వ్యర్థాల ద్వారా విద్యుత్తు తయారీ విధానాల గురించి పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. దేశంలో, ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయేతర ఇంధనవనరుల వినియోగం తీరుతెన్నులు, రాష్ట్రాల వారీ ఉత్పత్తి సామర్థ్యాలతో పాటు భారత ప్రభుత్వ ప్రణాళికలు, పథకాలు, అంచనాలు, లక్ష్యాలను గణాంకాల సహితంగా తెలుసుకోవాలి.



సంప్రదాయేతర ఇంధన వనరులు

(శక్తివనరులు)

ఆధునిక జీవనవిధానంలో విద్యుచ్ఛక్తి వినియోగించకుండా క్షణం కూడా గడవదు. శక్తి ఉత్పాదకాలుగా గతంలో బొగ్గు, పెట్రోలు వంటి తరిగిపోయే వనరులనే వాడేవారు. పరిశోధనలతో సౌరశక్తి, పవనశక్తి, సముద్ర తరంగాల శక్తి, భూతాప శక్తి, బయో ఇంధనాలు తదితర సంప్రదాయేతర లేదా తరిగిపోని ఇంధన/శక్తి వనరులను గుర్తించారు. భారత ప్రభుత్వం సంప్రదాయేతర ఇంధన వనరుల అవసరాన్ని 1970లో గుర్తించింది. వీటి అభివృద్ధి, నిర్వహణ కోసం 1982లో ఒక శాఖను, 1992లో సంప్రదాయేతర ఇంధనవనరుల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. ఈ ఇంధనవనరుల ప్రాముఖ్యతను వివరించేందుకు 2004 నుంచి ఏటా ఆగస్టు 20న రాజీవ్ అక్షయ్ ఉర్జాదివస్‌గా నిర్వహిస్తోంది. దేశంలో మొత్తం సంప్రదాయేతర ఇంధనవనరుల ఉత్పత్తి సామర్థ్యం 10.97 లక్షల మెగావాట్లు. 2020-21 లెక్కల ప్రకారం సౌరశక్తి 68.2%, పవన విద్యుత్తు 27.5%, తరంగశక్తి, జీవశక్తి మొదలైనవి 4.2% ఉత్పత్తి వాటాతో ఉన్నాయి. దేశంలో 2024, జూన్ 30 నాటికి పునరుత్పాదక శక్తివనరుల స్థాపిత సామర్థ్యం 1,95,013 మెగావాట్లు. ఇందులో జలవిద్యుచ్ఛక్తి 46,928 మె.వా, పవన విద్యుత్తు 46,656 మె.వా, సౌరవిద్యుత్తు 85,474 మె.వా, భూతాప, జీవశక్తి 10,355 మె.వా, వ్యర్థాల నుంచి 593 మె.వా, చిన్న జలవిద్యుత్తు కేంద్రాల నుంచి 5,005 మెగా వాట్లు. మొత్తం దేశ విద్యుత్తు ఉత్పాదక స్థాపిత సామర్థ్యంలో పునరుత్పాదక విద్యుత్తు వనరుల వాటా 43.7 శాతానికి చేరింది. రాష్ట్రాల వారీగా చూస్తే (2023 లెక్కలు) పునరుత్పాదక ఇంధనవనరుల స్థాపక సామర్థ్యంలో 1) రాజస్థాన్ (24,531 మె.వా) 2) గుజరాత్ (23,967) 3) కర్ణాటక (21,886) 4) తమిళనాడు (21,135) 5) మహారాష్ట్ర (16,311) తొలి 5 స్థానాల్లో ఉన్నాయి.

సౌరశక్తి: విశాలమైన ప్రదేశాల్లో సౌరఫలకాలను ఏర్పాటు చేసుకొని విద్యుత్తును ఉత్పత్తి చేసే, నిల్వచేసే విధానాన్ని సౌరవిద్యుత్తుగా పేర్కొంటారు. దీని ఉత్పత్తి వ్యయం కూడా తక్కువే. ఒక చదరపు కిలోమీటరుకు 20 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చు. ప్రస్తుతం దేశం సంవత్సరానికి సుమారు 5000 ట్రిలియన్ కిలోవాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. సౌరవిద్యుత్తు ఉత్పత్తి, సామర్థ్యం కలిగిన రాష్ట్రాల్లో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో గుజరాత్, కర్ణాటక, తమిళనాడు ఉన్నాయి. 2020 నాటికి ఆసియాలోనే అతిపెద్ద సౌరవిద్యుత్తు ప్లాంటు మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాలోని గురుతెహ్‌సిల్ ప్లాంటు. 2024 గణాంకాల ప్రకారం ప్రపంచంలోనే అతిపెద్ద సౌరవిద్యుత్తు పార్కు రాజస్థాన్‌లోని భద్లా సోలార్ పార్క్. దీన్ని 2,245 మెగావాట్ల స్థాపనా సామర్థ్యంతో థార్ ఎడారిలోని జోధ్‌పుర్ జిల్లాలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సౌరవిద్యుత్తు ఉత్పత్తిలో చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2018లో అటల్ జ్యోతి యోజన కింద దేశవ్యాప్తంగా సోలార్ వీధిదీపాలను ఏర్పాటు చేశారు. 2019లో 'కుసుమ్' పథకం కింద రైతులకు పాత డీజిల్ ఇంజిన్ల స్థానంలో సౌరశక్తితో నడిచే పంపుసెట్లు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించారు. 'ఉజాలా' పథకం కింద దేశమంతా ఎల్‌ఈడీ బల్బులను పంపిణీ చేశారు.

పవన విద్యుత్తు: ఎత్తైన కొండపైన వేగంగా వీచే గాలులకు అనుకూలంగా గాలిమర చక్రాలు అమర్చి విద్యుత్తు ఉత్పత్తి చేసే విధానం. టర్బైన్‌ల ద్వారా గాలి విద్యుచ్ఛక్తిగా మారుతుంది. పవన విద్యుత్తు ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ నాలుగో స్థానంలో (మార్చి 2024 నాటికి) ఉంది. మొదటి మూడు స్థానాల్లో చైనా, అమెరికా, జర్మనీ ఉన్నాయి. 2024 లెక్కల ప్రకారం భారత్ పవన విద్యుత్తు స్థాపన సామర్థ్యం 46.4 గిగావాట్లు. పవన విద్యుత్తులో ముందంజలో ఉన్న రాష్ట్రం తమిళనాడు. గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

సముద్ర తరంగాల ద్వారా విద్యుచ్ఛక్తి: సముద్ర అలల ద్వారా విద్యుత్తు ఉత్పత్తికి దేశంలో అనుకూల ప్రాంతం గల్ఫ్ ఆఫ్ కంబట్, గల్ఫ్ ఆఫ్ కచ్, సుందర్బన్ అడవులు. దేశంలో అలల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం గుజరాత్‌లోని కాండ్లా దగ్గర సింధు శాఖ వద్ద ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం దేశంలో 8,300 మెగావాట్ల తరంగ విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం ఉంది. కాంబట్ సింధు శాఖలో 700 మెగావాట్లు, కచ్ సింధుశాఖలో 1200 మెగావాట్లు, సుందర్బన్ డెల్టాలో 100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నట్లు అంచనా.

జల విద్యుచ్ఛక్తి: వర్షపునీటిని ఆనకట్టలు, రిజర్వాయర్లలో నిల్వ చేసి, అవసరమైనప్పుడు కిందికి వదిలి టర్బైన్‌ల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు. ఈ విధంగా జల విద్యుత్తు ఉత్పత్తికి అయ్యే ఖర్చు చాలా తక్కువ. 2024, జూన్ నాటి లెక్కల ప్రకారం దేశంలో జల విద్యుచ్ఛక్తి స్థాపిత సామర్థ్యం 1,33,40 మెగా వాట్లు. ప్రస్తుత లెక్కల ప్రకారం దేశంలో థర్మల్, పునరుత్పాదక ఇంధన వనరులు (సౌరశక్తి, పవనశక్తి) తర్వాతి స్థానంలో జలవిద్యుచ్ఛక్తి ఉంది. దేశంలో మొదటి జల విద్యుత్తు కేంద్రాన్ని డార్జిలింగ్‌లో 1897లో నెలకొల్పారు. రెండోదాన్ని 1902లో శివసముద్రంలో (కర్ణాటక) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉన్న 23 హైడ్రోఎలక్ట్రిక్ విద్యుత్తు ప్రాజెక్టుల్లో ఇందిరాసాగర్ విద్యుత్తు కేంద్రం పెద్దది. దేశంలో అత్యధికంగా జలవిద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం పంజాబ్.

భూతాపశక్తి (జియోథర్మల్ ఎనర్జీ): భూ అంతర్భాగంలో ఉండే వేడిని విద్యుచ్ఛక్తిగా మారుస్తారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ప్రాథమిక పరిశోధన ప్రకారం దేశంలో సుమారు 350 వరకు వేడినీటి బుగ్గలున్నట్లు తెలుస్తోంది. వీటిలో విద్యుత్తు ఉత్పత్తికి పనికొచ్చేవి బారన్ ఐలాండ్, లద్దాఖ్‌లోని పూగా వ్యాలీ, చుమ్మత్తాంగ్, గుజరాత్‌లోని కాంబే, ఛత్తీస్‌గఢ్‌లోని టాటాపాని, తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహారాష్ట్రలోని రత్నగిరి, జల్‌గావ్, హిమాచల్ ప్రదేశ్‌లోని మణికరన్, ఝార్ఖండ్‌లోని సూరజ్‌ఖండ్‌లో ఉన్నాయి.

బయోమాస్: వ్యవసాయ, పశువుల వ్యర్థాలు, చెత్త ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేసే విధానం. ఇదేకాకుండా మొక్కల ద్వారా బయోడీజిల్, బయోఇథనాల్, బయో హైడ్రోజన్ మొదలైనవి తయారుచేస్తున్నారు. 2024 లెక్కల ప్రకారం దేశంలో బయో ఎనర్జీ ప్లాంట్ల స్థాపన సామర్థ్యం 10,959.42 మెగావాట్లు. బయో ఎనర్జీ ఉత్పత్తిలో ముందున్న రాష్ట్రాలు మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, పంజాబ్. భారత ప్రభుత్వం 2030 నాటికి పెట్రోల్‌లో 20% ఇథనాల్‌ను కలపాలని, అలాగే 5% బయోడీజిల్‌ను వినియోగంలోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

హైడ్రోజన్ శక్తి: హైడ్రోజన్ నుంచి శక్తి ఉత్పత్తికి 'ఫ్యూయల్ సెల్స్' ముఖ్యమైనవి. దేశంలో హైడ్రోజన్ శక్తి ఉత్పత్తి, వినియోగానికి నేషనల్ హైడ్రోజన్ ఎనర్జీ కార్యక్రమం అమలులోకి వచ్చింది. భారత్ నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను 2023 జనవరిలో ప్రారంభించారు. దీని ప్రకారం 2030 నాటికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదన సాధించాలన్నది లక్ష్యం. భారతదేశ మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్టు హిమాచల్‌ప్రదేశ్‌లోని ఝక్రీలో 1500 మెగావాట్ల సామర్థ్యంతో ప్రారంభమైంది. గ్రీన్‌హైడ్రోజన్ అనేది ఒక స్వచ్ఛ ఇంధన శక్తి. సూర్యరశ్మి, నీరు ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్ తయారుచేస్తారు.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్